ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY
జగిత్యాల
జిల్లా వార్తలు
5★★
సోమవారం 17 మార్చి 2025

వైభవంగా పెద్దాపూర్ మల్లన్న బోనాలు

- హాజరైన 70వేల మంది భక్తులు
- పూజలు నిర్వహించిన ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

7



పెద్దాపూర్‌లోని మల్లన్నస్వామి ఆలయం చుట్టూ రథోత్సవాన్ని నిర్వహిస్తున్న భక్తులు

ఘనంగా వేంకటేశ్వర స్వామి డోలోత్సవం

- లక్ష్మీ నృసింహస్వామి దక్షిణ దిగ్యాత్ర

7



పోలీస్‌స్టేషన్‌లో స్వామి వారలకు పూజలు

గుప్పుమంటున్న గంజాయి



జగిత్యాలలో గంజాయి విక్రేతల అరెస్టు చూపిస్తున్న పోలీసులు(ఫైల్)

- జిల్లాలో చాపకింద నీరులా విక్రయాలు
- పొరుగు రాష్ట్రాలు, ఇతర జిల్లాల నుంచి సరఫరా
- యువకులు, విద్యార్థులే టార్గెట్
- తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలంటున్న నిపుణులు

జగిత్యాల, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో చాపకింద నీరులా గంజాయి దందా విస్తరిస్తోంది. పల్లె, పట్నం తేడా లేకుండా అంతటా గంజాయి అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి. పోలీసులు దాడులు నిర్వహిస్తూ కేసులు నమోదు చేస్తున్నా ఈ దందాకు అడ్డుకట్ట పడడం లేదు. ఫలితంగా యువకులు, విద్యార్థులు మత్తుకు బానిసలుగా మారి విలువైన జీవితాన్ని నాశనం చేసుకుంటున్నారు. ఆంధ్ర, ఒడిశా, ఛత్తీస్‌గఢ్ తదితర రాష్ట్రాల సరిహద్దు గ్రామాల నుంచి జిల్లాకు తెచ్చి జగిత్యాల, కోరుట్ల, ధర్మపురి, మెట్‌పల్లి, రాయికల్ వంటి పట్టణ ప్రాంతాలతో పాటు మండల కేంద్రాలు, పల్లెల్లోనూ విక్రయిస్తున్నారు. దీంతో మత్తుకు బానిసలవుతున్న వారి సంఖ్య పెరుగుతోంది. పట్టణాలు, మండల కేంద్రాలోనే కాకుండా గ్రామాల్లో కూడా చాలా మంది యువకులు గంజాయికి అలవాటు పడినట్లు తెలుస్తోంది. దీంతో కెరీర్ దెబ్బతినడంతో పాటు ఆరోగ్య సమస్యలూ ఎదురవుతున్నాయి.

● జిల్లాలో గంజాయి కేసులు ఇలా...

జిల్లాలో 2021 సంవత్సరంలో 14 గంజాయి కేసులు నమోదు కాగా 38 మందిని పోలీసులు అరెస్టు చేసి 30 కిలోల గంజాయిని పట్టుకున్నారు. 2022 సంవత్సరంలో 11గంజాయి కేసులు నమోదు కాగా 32మందిని పోలీసులు అరెస్టు చేసి 18.42 కిలోల గంజాయిని పట్టుకున్నారు. 2023 సంవత్సరంలో 13గంజాయి కేసులు నమోదు కాగా 36మందిని పోలీసులు అరెస్టు చేసి సుమారు 91.54కిలోల గంజాయిని పట్టుకున్నారు. 2024 సంవత్సరంలో 50గంజాయి కేసులు నమోదు కాగా 135 మందిని పోలీసులు అరెస్టుచేసి రూ. 16,43,189 విలువ గల 68.314 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. కొన్ని నెలల క్రితం జిల్లాలోని రాయికల్, మల్లాపూర్ మండలాల్లో విశాఖ నుంచి తెచ్చి విక్రయానికి తీసుకువెళ్తున్న 10 కిలోల గంజాయిని పోలీసులు పట్టుకున్నారు. ఈ సంఘటనలో పోలీసులకు పట్టుబడ్డ వారిలో చదువు మానేసిన విద్యార్థులు, యువకులు ఉండడం విశేషం. మరొక సంఘటనలో గంజాయికి బానిసైన బాలికను ప్రేమ పేరుతో ఓ యువకుడు ట్రాప్ చేయడం, మరో ఇద్దరు యువకులు సైతం అఘాయిత్యానికి పాల్పడడం కలకలం రేపింది.

జిల్లాలో ఇటీవల జరిగిన కొన్ని సంఘటనలు..

- గత నెల 20వ తేదీన జగిత్యాల రూరల్ మండలం కండ్లపల్లిలో రూరల్ పోలీసులు వాహన తనిఖీలు చేపట్టగా పట్టణంలోని పలు కాలనీలకు చెందిన ముగ్గురు యువకులు 130 గ్రామాల గంజాయిని తరలిస్తూ పోలీసులకు పట్టుబడ్డారు.
- గత నెల 21వ తేదీన జగిత్యాల రూరల్ మండలం రఘురాముల కోట శివారులో అనుమానాస్పదంగా తిరుగుతున్న జగిత్యాల అరవింద్‌నగర్, మార్కండేయనగర్ కాలనీలకు చెందిన ఇద్దరు యువకులు గంజాయి విక్రయిస్తూ పట్టుపడ్డారు. వీరి వద్ద 12.11 గ్రాముల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.
- ఈనెల 10న కోరుట్లకు చెందిన ఓ విద్యార్థి హైదరాబాద్‌లోని పలు విద్యా సంస్థల్లో తోటి విద్యార్థులకు గంజాయిని విక్రయిస్తూ అక్కడి పోలీసులకు పట్టుపడ్డాడు. ఆంధ్రాలోని విశాఖ, సీలేరు తదితర ప్రాంతాల నుంచి ప్యాకెట్ల రూపంలో గంజాయిని తీసుకవచ్చి విద్యార్థులు, యువకులకు విక్రయిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు.
- ఈనెల 15న మెట్‌పల్లి శాంతినగర్ కాలనీలో గల ఓ నివాసంలో పోలీసులు సోదాలు నిర్వహించి గంజాయి విక్రేతలైన బీహార్ రాష్ట్రానికి చెందిన రూపేష్ కుమార్, సునీల్ కుమార్, చోటుకుమార్, సంతోష్ కుమార్‌లను పట్టుకున్నారు. వీరి వద్ద 450 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.

● విద్యార్థులు, యువతే టార్గెట్‌గా...

జిల్లాలో గంజాయి విక్రయిస్తున్న ముఠాలు మైనర్లు, విద్యార్థులు, యువతనే టార్గెట్ చేసుకుంటున్నాయి. పలువురు విద్యార్థులు అర్ధంతరంగా చదువులు మానేసి గంజాయి రవాణా చేస్తున్నారు. తాజాగా విశాఖ, సీలేరు ప్రాంతాల నుంచి జగిత్యాలకు తీసుకువస్తున్న ఐదుగురు యువకులను పోలీసులు పట్టుకోవడంతో ఈ విషయంలో వెలుగులోకి వచ్చింది. చదువుకునే వయసులో వ్యసనాలకు అలవాటు పడిన కొంత మంది విద్యార్థులు ఈజీగా డబ్బు సంపాదించడానికి గంజాయి రవాణా చేసి, విద్యార్థులకు, యువకులకు విక్రయిస్తున్నారు. దీంతో వచ్చిన డబ్బులతో జల్సాలు చేస్తున్నారు. పలువురు విద్యార్థులు, యువత తల్లిదండ్రులకు తెలియకుండా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారు.

● చాక్లెట్ల రూపంలో గంజాయి

పొరుగు రాష్ట్రాలు, జిల్లాల నుంచి జగిత్యాల జిల్లాకు గంజాయిని అక్రమంగా రవాణా చేస్తున్నారు. ఇతర ప్రాంతాల నుంచి తెచ్చిన గంజాయిని ప్యాకెట్ల రూపంలో విక్రయిస్తున్నట్లు పోలీసుల విచారణలో తేలింది. వివిధ పేర్లతో ఉన్న గంజాయి చాక్లెట్లు మార్కెట్‌లో లభిస్తున్నట్లు తెలుస్తోంది. బ్రెడ్, జామున్, కేక్‌ల మధ్యలో గంజాయి చేర్చి విక్రయిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఆంధ్రా నుంచి ఇక్కడికి దిగుమతి అయ్యే కొబ్బరి బోండాలు, ఇతర వాహనాల్లో సైతం గుట్టు చప్పుడు కాకుండా పలువురు అక్రమార్కులు..

...మిగతా 8లో

కేంద్ర ప్రభుత్వ విధానాలను ప్రశ్నించాలి

-సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ



ర్యాలీ నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు

జగిత్యాల అర్బన్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ విధానాలను ప్రశ్నించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ అన్నారు. ఆదివారం జగిత్యాలలో జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అర్వింద్ ఎంపీగా గెలిచినప్పటి నుంచి జగిత్యాల జిల్లా అభివృద్ధికి నయా పైసా కూడా ఖర్చు పెట్టలేదన్నారు. ఈ విషయమై ప్రజలు ఆయనను నిలదీయాలని పిలుపునిచ్చారు. ఏడాదిన్నర కాంగ్రెస్ పాలనలో ప్రజలకు చేస్తానన్న హామీల అమలు జరిగేలా బడ్జెట్‌లో కేటాయింపులు చేయాలని అన్నారు. అంతకుముందు పట్టణంలో సీపీఎం నాయకులు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు తిరుపతి నాయక్, లీలల బాలకృష్ణ, తప్పెట్ల స్కైలాబ్ బాబు, సీపీఎం జిల్లా కార్యదర్శి పుప్పాల శ్రీకాంత్, ఇందూరి సులోచన, ఎంఎ చౌదరి, మహిపాల్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

-ఎమ్మెల్యే సంజయ్ కుమార్



రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

జగిత్యాల అర్బన్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): పేదల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తుందని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ అన్నారు. ఆదివారం నియోజకవర్గంలోని 102 మంది లబ్ధిదారులకు 28 లక్షల 25 వేల విలువ గల ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను పార్టీ కార్యాలయంలో పంపిణీ చేశారు. అనంతరం పట్టణంలోని గోవిందుపల్లెలో రూ.35 లక్షల ఈజీఎస్ నిధులతో సిమెంట్ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అంతకుముందు శ్రీ శివాంజనేయ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లింగంపేట పల్లె దవాఖానాను త్వరలో ప్రారంభించుకుందామన్నారు. మెడికల్ కళాశాల ఏర్పాటుతో నాణ్యమైన వైద్యం అందుబాటులోకి వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్‌లు అడువాల జ్యోతి, గోలి శ్రీనివాస్, ఏఎంసీ మాజీ చైర్మన్ దామోదర్ రావు, కాంగ్రెస్ పార్టీ నాయకులు నారాయణ రెడ్డి, మనోహర్ రెడ్డి, నారపాక రమేష్, చెరుకు ఫ్యాక్టరీ చైర్మన్ నరసింహా రెడ్డి, దూమాల రాజ్ కుమార్, శెట్టిపల్లి సుధాకర్, మాజీ సర్పంచులు స్వప్న, జుంబర్తి శంకర్, పూలగాని ప్రేమలత, వీరబత్తిని శ్రీనివాస్, కస్తూరి శ్రీనివాస్, ఎంపీడీవో వాసవి, గట్టు సతీష్, గుడాల రాజేష్, మాజీ కౌన్సిలర్లు పాల్గొన్నారు.

'ఎడ్యుకేషన్ హబ్‌గా జగిత్యాల'

రాయికల్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లా కేంద్రం ఎడ్యుకేషన్ హబ్‌గా మారిందని ఎమ్మెల్యే సంజయ్ కుమార్ అన్నారు. మండలంలోని ఉప్పుమడుగు కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాలలో ఆదివారం రూ.3 కోట్ల 25 లక్షలతో అదనపు తరగతి గదుల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జగిత్యాలకు ఎస్సీ ఉమెన్స్ డిగ్రీ కళాశాల మంజూరుతో 240 సీట్లు అందుబాటులో ఉన్నాయన్నారు. ఉమెన్స్ డిగ్రీ కళాశాలలో రూ.5 కోట్లతో అదనపు తరగతి గదుల నిర్మాణానికి పనులు జరుగుతున్నాయన్నారు. రాయికల్‌కు లైబ్రరీ మంజూరు చేశామన్నారు. అల్లీపూర్ గ్రామంలో రూ.6 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఈ కార్యక్రమాల్లో పీఏసీఎస్ చైర్మన్ రాజరెడ్డి, డీఈవో రాము నాయక్, ఈఈ అనిత సింగ్, తహసీల్దార్ ఖయ్యూం, ఎంపీవో సుష్మా, ప్రిన్సిపాల్ శోభారాణి పాల్గొన్నారు.


'యోగాతో సంపూర్ణ ఆరోగ్యం'

కోరుట్ల, మార్చి 16 (ఆంధ్రజ్యోతి) : యోగా సాధనతో సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని హార్ట్‌ఫుల్ నెస్, రామచంద్ర మిషన్ యోగా శిక్షకుడు హరికృష్ణ అన్నారు. ఆదివారం కోరుట్ల పట్టణంలోని వాసవి కళ్యాణ భవనంలోహార్ట్‌ఫుల్ నెస్, రామచంద్ర మిషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న యోగా శిక్షణను హరికృష్ణ వివిధ ఆసనాలు వేసి ప్రదర్శించారు. ఈ సందర్భంగా నిర్వాహకుడు మంచాల కృష్ణ, శిక్షకుడు హరికృష్ణ మాట్లాడుతూ ధ్యానం చేయడం వల్ల ఆధ్యాత్మికతతో పాటు మానసిక ప్రశాంతత లభిస్తుందని అన్నారు.

ప్రతి ఒక్కరూ యోగా చేయాలని, దీంతో ఒత్తిడి కూడా దూరం అవుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పట్టన ఆర్యవైశ్య సంఘ సభ్యులు మోటూరి రాజు, పడిగెల శ్రీనివాస్, మంచాల జగన్, బట్లు హరికృష్ణ, మంచాల రాజలింగం, శ్రీనివాస్, మంచాల జగన్‌లతో పాటు పలువురు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి సహాయనిధి పేదలకు వరం

-ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్



సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ చేస్తున్న విప్ ఆది శ్రీనివాస్

కథలాపూర్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి) : ముఖ్యమంత్రి సహాయనిధి పేదలకు వరం లాంటిదని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయంలో ఆదివారం 28మందికి రూ. 10.77 లక్షల విలువైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ సర్కారు కొలువుదీరిన వెంటనే ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేసి ప్రజా మన్ననలు పొందుతోందన్నారు. ఆరోగ్యశ్రీ పథకం కింద రూ.5 లక్షల పరిమితిని రూ.10 లక్షలకు పెంచి నిరుపేదలకు న్యాయం చేశారని గుర్తు చేశారు. అత్యవసర సమయంలో అవసరమైన శస్త్ర చికిత్సల కోసం ఎల్‌వోసీలు మంజూరు చేస్తూ పేదలకు సర్కారు వైద్యం అందిస్తు న్నామన్నారు. మేడిపల్లి, భీమారం, కథలాపూర్ మండ లాల వరప్రదాయినిగా ఉన్న సూరమ్మ చెరువు పెండింగ్ పనుల కోసం నిధులు మంజూ రు చేయించి రైతుల చిరకాల వాంఛ తీరబోతున్నందుకు సంతోషంగా ఉందని చెప్పారు. గ్రామాల్లో వివిధ పథకాల కింద నిధులు మంజూరు చేసి గడప గడపకూ సీసీ రోడ్డు వేయించే కార్యక్రమం కొనసాగిస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ పూండ్ర నారాయణరెడ్డి, వైస్ చైర్మన్ పులి శిరీష హరిప్రసాద్, మండల అధ్యక్షుడు కాయితి నాగరాజు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అజీం, ఏఎంసీ డైరెక్టర్లు వాకిటి రాజరెడ్డి, గంగాధర్, అల్లకొండ విజయ్, తలారి మోహన్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

నియామకం

కథలాపూర్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): మండల బీసీ సాధికారిత సంఘ అధ్యక్షుడిగా గంభీర్‌పూర్‌కు చెందిన కాల్వ సత్యనారాయణను నియమిస్తూ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడ కొండ దేవయ్య, రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు పోలాస నరేందర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ గ్రామ స్థాయిలో బీసీ సంఘాలను బలోపేతం చేసి ఐక్యత కోసం కృషి చేస్తానని చెప్పారు. విద్యా, ఉద్యోగ, రాజకీయ, ఉపాధి రంగాల్లో బీసీలు అభివృద్ధి సాధించడానికి తన వంతు కృషి చేస్తానన్నారు.

రైతుల కోసం పోరాటాలకు సిద్ధం

మల్లాపూర్, మార్చి, 16 (ఆంధ్రజ్యోతి) : పార్టీలకు అతీతంగా రైతుల కోసం పోరాటాలకు సిద్ధం అవుదామని మండలంలోని మొగిలిపేట గ్రామ మాజీ సర్పంచ్, బీఆర్ఎస్ నాయకుడు నాగరాజు అన్నారు. ఆదివారం గ్రామంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రుణ మాఫీ కానీ రైతుల వివరాలను సేకరించామన్నారు. కొంత మందికి రుణ మాఫీ చేసి గొప్పలు చెప్పుకుంటున్న రాష్ట్ర ప్రభుత్వం అవలంబిస్తున్న తీరుపై పోరాటం చేయడానికి పార్టీలకతీతంగా సిద్ధం కావాలన్నారు. ఆయన వెంట పలువురు నాయకులు ఉన్నారు.

పీహెచ్‌సీ భవన నిర్మాణానికి భూమి పూజ

బుగ్గారం, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): బుగ్గారంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవన నిర్మాణానికి విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ఆదివారం భూమి పూజ నిర్వహించారు. అనంతరం పన్నెండు లక్షల ఎనభై ఏడు వేల రూపాయల విలువైన చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వేముల సుభాష్, ఉపాధ్యక్షులు నగునూరి నర్సగౌడ్, నాయకులు తాడెపు లింగన్న, శ్రీనివాస్‌లు పాల్గొన్నారు.

సమాజ అభివృద్ధిలో మహిళల పాత్ర కీలకం



మహిళను సన్మానిస్తున్న విప్ అడ్లూరి, ఎమ్మెల్యే సంజయ్

జగిత్యాల, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): సమాజ అభివృద్ధిలో మహిళల పాత్ర కీలకమని ప్రభుత్వ విప్, ధర్మపురి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. ఆదివారం మహిళాభివృద్ధి శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మహిళా దినోత్సవం కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్‌తో కలిసి పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మహిళల యొక్క హక్కులను కాపాడుతూ వారిని ఆర్థికంగా బలోపేతం చేయడానికి ఎన్నో పథకాలు ప్రవేశ పెట్టిందన్నారు. మహిళల మెరుగైన జీవన ప్రమాణాల కోసం 5 వందలకే గ్యాస్ సిలిండర్ ఇవ్వడంతో పాటు నెలకు 200 యూనిట్ల ఉచిత కరెంటు అందిస్తున్నామన్నారు. అలాగే జిల్లాలో త్వరలో ఏర్పాటు చేసే నాలుగు మెగావాట్ల సోలార్ విద్యుత్ తయారీ ప్లాంట్లను స్వశక్తి సంఘాలకే అప్పగిస్తామన్నారు. మహిళల్లో ఉన్న ప్రత్యేక ప్రతిభను వెలికి తీయాలని ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ అన్నారు. అనంతరం తమ స్వశక్తితో కుటుంబాన్ని పోషించి పిల్లలను ఉన్నత స్థానాల్లో నిలిపిన మహిళలను, వృత్తిలో ఉన్నత ప్రతిభ కనబరచిన మహిళలను ఈసందర్భంగా సన్మానించారు. అనంతరం చిన్నారులు చేసిన నృత్యాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బీఎస్ లత, జిల్లా సంక్షేమ అధికారి బొనగిరి నరేష్, సీడీపీవోలు, సూపర్ వైజర్లు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు నాయకుల పరామర్శ

బీర్‌పూర్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): బీర్‌పూర్ మండలంలోని తుంగూర్ గ్రామానికి చెందిన మాజీ ఎంపీపీ గుడిసె జితేందర్ యాదవ్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడగా ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి ఆదివారం పరామర్శించారు. బీర్‌పూర్ మండలకేంద్రానికి చెందిన గొల్లపెల్లి శ్రీనివాస్ అనే గీత కార్మికుడికి గాయాలు కాగా పరామర్శించి ఆరోగ్యపరిస్థితి అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట మాజీ ఎంపీపీ రమేష్, సారంగాపూర్ మండల కాంగ్రెస్ అధ్యక్షులు రాంచంద్రరెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ లక్ష్మన్ రావ్, కొల్వాయి సింగిలివిండో చైర్మన్ నవీన్ రావ్, మాజీ జెడ్పీటీసీ ముక్క శంకర్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు అఖిల్ ఉన్నారు.

● పెగడపల్లి, మార్చి 16(ఆంధ్రజ్యోతి): పెగడపల్లి మండలంలోని బతికెపల్లి గ్రామానికి చెందిన రెండు కుటుంబాలను ఆదివారం మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ పరామర్శించారు. ఈ నెల 10న రాత్రి గ్రామంలో కారు ఢీకొని గాయపడి చికిత్స పొందుతూ మృతి చెందిన సయ్యద్ సర్వర్ పాషా, సయ్యద్ జాకీర్ పాషా కుటుంబాలను పార్టీ నాయకులతో కలసి వెల్లి ఈశ్వర్ పరామర్శించారు. ఆయన వెంట పార్టీ నాయకులు ఓరుగంటి రమణారావు, లోక మల్లారెడ్డి, ఉప్పుగండ్ల నరేందర్ రెడ్డి, తిర్మని నర్సింహారెడ్డి ఉన్నారు.

తల్లిదండ్రులను పోషించని కుమారులకు కౌన్సెలింగ్

జగిత్యాల అర్బన్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రులను పోషించకుండా ఇబ్బందులకు గురిచేస్తున్న కొడుకులు, కోడళ్లకు తెలంగాణ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు అశోక్ కుమార్ ఆధ్వర్యంలో ప్రతినిధులు కౌన్సెలింగ్ ఇచ్చారు.

ఈ సందర్భంగా హరి అశోక్ కుమార్ మాట్లాడుతూ వృద్ధులైన తల్లిదండ్రులను పోషించకుండా నిరాదరిస్తే చట్ట ప్రకారం ఆరు మాసాలకు పైగా జైలు శిక్ష, జరిమానా విధిస్తారన్నారు. దీంతో పాటు వారసులు పొందిన ఆస్తిని తిరిగి తల్లిదండ్రుల పేరిట రిజిస్ట్రేషన్ చేయిస్తామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సిటిజన్స్ కార్యదర్శి గౌరిశెట్టి విశ్వనాథం, వెలుముల ప్రకాష్ రావు, బయటి రాధ, కరుణ పాల్గొన్నారు.

వృద్ధురాలి దారుణ హత్య



వెంకటమ్మ(ఫైల్)

కరీంనగర్ క్రైం, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ జిల్లా కొత్తపల్లి శివారులో వృద్ధురాలిని గుర్తు తెలియని వ్యక్తులు గొంతుకోసి హత్య చేశారు. కరీంనగర్ రూరల్ సీఐ ప్రదీప్‌కుమార్ వివరాల ప్రకారం.. కొత్తపల్లి నుంచి దేశరాజపల్లి వెళ్లే రోడ్డులో ఎస్ఆర్ఎస్‌పీ కెనాల్ పక్కన వృద్ధురాలు రక్తపుమడుగులో ఉందని స్థానికులు ఆదివారం పోలీసులకు సమాచారం అందించారు. విచారణ చేపట్టిన పోలీసులు హత్యకు గురైంది జిల్లాలోని తిమ్మాపూర్ మండలం నుస్తులాపూర్ గ్రామానికి చెందిన వృద్ధురాలు తనుకు వెంకటమ్మ(70)గా గుర్తించారు. వెంకటమ్మ కోహెడ్ మండలం రాంచంద్రాపూర్‌లో తన పెద్ద కూతురు లక్ష్మీ వద్ద ఉండగా మనుమడు(లక్ష్మీ కుమారుడు పుల్లూరు చంద్రశేఖర్) ఫోన్‌చేసి ఎల్ఐసీ డబ్బులు తీసుకునేందుకు కరీంనగర్‌కు రావాలని సూచించాడు. దీంతో వెంకటమ్మ బస్సులో కరీంనగర్‌కు చేరుకుంది. ఆ తరువాత ఆమెఫోన్ స్విచ్‌ఆఫ్ అయ్యింది. వెంటకమ్మకు రావాల్సిన ఎల్ఐసీ డబ్బుల కోసం కొద్ది రోజుల కిందట దరఖాస్తు చేసుకుంది. డబ్బుల కోసం మనుమడు చంద్రశేఖర్ ఫోన్ చేయగా కరీంనగర్‌కు చేరుకున్న వెంకటమ్మ కార్యాలయానికి వెళ్లిందా? లేదా? అనేది తెలియడం లేదు. మరోవైపు వృద్ధురాలికి ఇద్దరు కూతుళ కాగా పెద్ద కూతురు కొడుకు చంద్రశేఖర్‌ను దత్తత తీసుకుందని, అతడు వెంకటమ్మతోనే నుస్తులాపర్‌లో ఉండేవాడని, కొంతకాలంగా కరీంనగర్ కోతిరాంపూర్‌లో నివాసం ఉంటున్నాడని బంధువులు తెలిపారు. గతంలో వెంకటమ్మను చంద్రశేఖర్ కొట్టినట్లు, తిమ్మాపూర్ పోలీసు స్టేషన్‌లో ఆమె ఫిర్యాదు చేసినట్లు సమాచారం. నుస్తులాపూర్‌లో వెంకటమ్మకు మూడు గుంటల స్థలం, ఇల్లు ఉందని, ఆ ఆస్తి కోసమే గొడవ జరిగి హత్యకు దారి తీసి నట్లుగా కూడా అనుమానాలు వ్యక్తమ వుతున్నాయి. నిందితులు పోలీసుల ఎదుట లొంగిపోయినట్లు తెలుస్తోంది.

ఉరేసుకొని ఒకరి బలవన్మరణం

కరీంనగర్ క్రైం, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ హనుమాన్ నగర్‌కు చెందిన గంపల సంపత్(35) ఒంటరితనం భరించలేక మనోవేదనతో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. కరీంనగర్ వన్ టౌన్ సీఐ బిల్ల కోటేశ్వర్ వివరాల ప్రకారం.. హనుమాన్‌నగర్‌కు చెందిన సంపత్‌కు 16ఏళ్ల కిందట వివాహమైంది. ఐదేళ్లక్రితం భార్య విడాకులు తీసుకొని వెళ్లిపోయింది. అప్పటినుంచి సంపత్ వెల్డింగ్ పని చేసుకుంటూ తనతండ్రితోనే కలిసి నివసిస్తున్నాడు. స్థానిక అపార్ట్‌మెంట్‌లో వాచ్‌మన్‌గా పనిచేస్తున్న తండ్రి శనివారం విధులకు వెళ్లాడు. ఆదివారం తిరిగి వచ్చేసరికి తలుపులు పెట్టి ఉన్నాయి. అనుమానంతో బలవంతంగా తలుపులు తెరిచిచూడగా ఇనుపరాడ్‌కు సంపత్ ఉరేసుకొని కనిపించాడు. భార్యతో విడాకుల కారణంగా మనోవేదనతో ఉరేసుకున్నాడని సంపత్ తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

చికిత్స పొందుతూ వృద్ధురాలి మృతి

ముస్తాబాద్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి) : కల్లు అనుకొని పురుగుల తాగి, వృద్ధురాలు చికిత్సపొందుతూ మృతిచెందిన ఘటన మండలంలోని పోతుగల్ గ్రామంలో చోటుచేసుకుంది. ఎస్సై సీహెచ్ గణేశ్ ఆదివారం తెలిపినవివరాల ప్రకారం.. పోత్గల్‌కు చెందిన జెల్ల బాలవ్వ (85) కొంతకాలంగా మానసికపరిస్థితి బాగోలేక వింతగా ప్రవర్తిస్తోంది. పొలానికి కొట్టగా మిగిలిన మందును ఇంట్లో బాటిల్‌లో పోసి ఉంచగా కల్లు అనుకొని తాగింది. దీంతో పరిస్థితి విషమంగా మారడంతో సిద్దిపేట జిల్లా కేంద్రంలోని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. బాలవ్వకు చికిత్స అందిస్తుండగా చనిపోయినట్లు తెలిపారు. మృతురాలి మనవడు జెల్ల అజయ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

విషజ్వరంతో మహిళ మృతి



ఆసియాబేగం (ఫైల్)

కాల్వశ్రీరాంపూర్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మోట్లపల్లి గ్రామానికి చెందిన ఎండీ ఆసియాబేగం(35)అనే మహిళ విషజ్వరంతో మృతిచెందింది. మృతురాలి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. మూడు రోజులుగా జ్వరంరాగా జమ్మికుంటలోని ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లి చికిత్స అందించారు. జ్వరం తగ్గడంతో అసుపత్రి నుంచి ఇంటికి తిరిగి వచ్చారు. శనివారం మళ్లీ జ్వరం రావడంతో కుటుంబసభ్యులు కరీంనగర్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. చికిత్సపొందుతూ ఆదివారం మృతిచెందింది. మృతురాలికి భర్త, కుమారుడు ఉన్నారు.

ఐదుగురిపై కేసు నమోదు

ఎల్లారెడ్డిపేట, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): మద్యం సేవించి వాహనాలు నడిపిన ఐదుగురిపై కేసు నమోదు చేశామని ఎస్ఐ రమాకాంత్ తెలిపారు. ఎల్లారెడ్డిపేట గ్రామ శివారులోని కామారెడ్డి-సిరిసిల్ల ప్రధాన రహదారిపై ఎస్ఐ రమాకాంత్ ఆధ్వర్యంలోని పోలీసులు ఆదివారం వాహన తనిఖీలను నిర్వహించారు. వాహనదారుల ధ్రువీకరణ పత్రాలను పరిశీలించారు. మద్యం తాగి వాహనాలు నడుపుతూ ఐదుగురు పట్టుబడ్డారు. వారిపై కేసు నమోదు చేశారు.

అదృశ్యమైన మాజీ సర్పంచ్ మృతి

● మోహన్‌రావుపేటలో విషాదం



దేవక్క (ఫైల్)

కోరుట్ల రూరల్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి) : మూడు రోజుల క్రితం అదృశ్యమైన కోరుట్ల మండలం మోహన్‌రావుపేట మాజీ సర్పంచ్ పూదరి దేవక్క (72) మృతదేహం ఆదివారం మల్యాల మండలం మానాల గ్రామ శివారులోని ఎస్ఆర్ఎస్పీ కాలువలో లభ్యమయినట్లు పోలీసులు తెలిపారు. దేవక్క అనారోగ్యంతో బాధపడుతూ మూడు రోజుల క్రితం ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాకపోవడంతో భర్త నర్సయ్య కోరుట్ల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో అదృశ్యం కేసు నమోదు చేశారు. మానాల గ్రామ శివారులో మహిళ మృతదేహం ఉందని అక్కడి పోలీసులు కోరుట్ల పోలీసులకు సమాచారం అందించారు. దీంతో పోలీసులు సంఘటన స్థలానికి వెళ్లగా దేవక్క బంధువులు ఆమె మృతదేహాన్ని గుర్తించారు. అనంతరం మృతదేహాన్ని కోరుట్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు. దేవక్క మృతితో మోహన్‌రావుపేట గ్రామంలో విషాదం నెలకొంది.

సింగరేణి క్వార్టర్‌లో చోరీ

యైటింక్లయిన్‌కాలనీ, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): గోదావరిఖని టూటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధి కాలనీలో శనివారం రాత్రి బొట్ల రాములు(టీటూ 1060) అనే సింగరేణి కార్మికుడి క్వార్టర్‌లో చోరీ జరిగింది. రెండు రోజుల క్రితం కుటుంబ సభ్యులందురూ ఊరికి వెళ్లి ఆదివారం తిరిగి వచ్చే సరికి దొంగతనం జరిగింది. తాళం పగులగొట్టి ఇంట్లో ఉన్న రూ.40వేల నగదు, 15తులాల వెండి ఆభరణాలను దుండగులు ఎత్తుకెళ్లారు. రాములు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. కాగా సివిల్ డిపార్ట్‌మెంట్ దారిలో టీటూ-568 క్వార్టర్‌లో నివాసం ఉండే రాజ్‌కుమార్ వారం రోజుల క్రితం ఊరు వెళ్ళాడు. శనివారం తిరిగి వచ్చే సరికి గేట్ తాళం పగులగొట్టి ఉండడే గాక తలుపుకు వేసి తాళం పగులగొట్టే ప్రయత్నం చేశారు. తాళం రాకపోవడంతో దొంగలు అక్కడ నుంచి వెళ్లిపోయారు. వారం రోజుల క్రితం షిర్కే సమీపంలో ఇదే తరహాలో తాళం వేసిన ఉన్న క్వార్టర్‌లో చోరీకి పాల్పడిన దుండగులు వెండి ఆభరణాలు, నగదు ఎత్తుకెళ్లారు. వరుస చోరీలతో కార్మిక కుటుంబాలు ఆందోళన గురవుతున్నాయి.

నేడు రాజన్న కల్యాణ మహోత్సవం

● అంగరంగ వైభవంగా ఏర్పాట్లు
● భారీగా తరలిరానున్న భక్తులు

వేములవాడ కల్చరల్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): ఆది దంపతులు శివపార్వతుల కల్యాణం చూద్దాం రారండి.. అంటూ దారులన్నీ రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ శైవక్షేత్రం వైపు చూస్తున్నాయి. సోమవారం రాజన్న ఆలయంలో శివపార్వతుల దివ్యకల్యాణం నిర్వహించనుండడంతో ఆదివారం రాజన్న క్షేత్రానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. రాజన్న ఆలయ ప్రధాన అర్చకుల ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 7 గంటలకు నుంచి ఉత్సవాలను ప్రారంభించారు. పుణ్యాహవాచనము, వర్దపూజ, పంచగవ్య మిశ్రణము, గౌరీపూజ, రక్షబంధనం, అచార్య బ్రహ్మాదిబుత్విగ్వరణము, దీక్షాబందనము, మంటప ప్రతిష్ఠ తదుపరి మంటప ప్రవేశము ఘనంగా నిర్వహించారు. సాయంత్రం 3.05 గంటల నుంచి శ్రీస్వామి వారికి అంకురార్పణము, అగ్నిప్రతిష్ఠ-వాస్తుహోమం చేపట్టారు. సాయంత్రం 4 గంటల నుంచి శివ మహాపురాణ ప్రవచనము, రాత్రి 7.05 గంటలకు భేరీపూజ, దేవతా హ్వాన జరిపించారు. మంగళహారతి, మంత్ర పుష్పము అనంతరం తీర్థప్ర సాద వితరణ గావించారు.

● నేడు నిర్వహించే పూజలు..

సోమవారం ఉదయం 7.05 గంటకు తీర్థరాజస్వామి పూజ, దేవతాహవనము, ధ్వజారోహణము, ఎదుర్కోళ్లు నిర్వహించనున్నారు. ఉద యం 10.40 గంటల నుంచి 12.55 వరకు శ్రీపార్వతిపరమేశ్వరుల దివ్య కల్యాణ మహోత్సవము జరుగుతాయి. సాయంత్రం 5 గంటలకు లాజా హోమము, ఔపాసనము, బలిహరణ ముతో పాటుగా పెద్దసేవ ఊరేగింపు కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు.



రాజన్న ఆలయంలో సంప్రోక్షణ నిర్వహిస్తున్న అర్చకులు



రాజన్న దర్శనం కోసం క్యూలో ఉన్న భక్తులు

● నెలకొన్న భక్తుల రద్దీ..

శివకల్యాణోత్స వాన్ని పురస్కరించుకుని వేములవాడ రాజరాజేశ్వర స్వామివారి ఆలయానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఈ సందర్భంగా ఆదివారం ఉదయం భక్తులు కళ్యాణకట్టలో తలనీలాలు సమర్పించుకుని ఆలయ ధర్మగుండంలో పవిత్రస్నానాలు ఆచరించారు. రాజన్నకు కోడెమొక్కు చెల్లించుకునేందుకు భక్తులు గంటల తరబడి క్యూలైన్‌లో బారులు తీరారు. ధర్మదర్శనం, శీఘ్రదర్శనం, బ్రేక్‌దర్శనం క్యూలైన్‌ల ద్వారా భక్తులు ఆలయంలోకి చేరుకుని శ్రీపార్వతిపరమేశ్వరులను దర్శించుకున్నారు. రాజన్నకు అత్యంత ప్రీతికరమైన కోడెమొక్కు చెల్లించుకున్నారు.

● ఏర్పాట్లను పరిశీలించిన ఎస్పీ..

వేములవాడ రాజరాజేశ్వర స్వామి ఆలయంలో సోమ నిర్వహించే శివకల్యాణ మహోత్సవానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరానున్న నేపథ్యంలో ఏర్పాట్లను ఎస్పీ గీతే మహేష్‌బాబా సాహెబ్ ఆదివారం పరిశీలించారు. రాజన్న ఆలయ పరిసరాలతో పాటుగా పట్టణ ఆవరణ, కల్యాణ వేదిక పలు విభాగాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా పార్కింగ్ స్థలాలు ఏర్పాట్లు, కళ్యాణ మండపం, గోశాల ఆలయంతో పాటుగా పరిసరా ప్రాంతాలో భక్తులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. వెంట రాజన్న ఆలయ ఈవో వినోద్‌రెడ్డి, టౌన్ సీఐ వీరప్రసాద్, ఆలయ ఈఈ రాజేష్, ఏఈ రామ్‌కిషన్, ప్రొటోకాల్ ఏఈవో అశోక్ తదితరులు ఉన్నారు.

రాజన్నకు పట్టువస్త్రాలు సమర్పించిన ఆది శ్రీనివాస్

వేములవాడ కల్చరల్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వర స్వామివారి ఆలయంలో సోమవారం నిర్వహించే శివ కల్యాణోత్సవానికి ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పట్టువస్త్రాలను సమర్పించారు. పట్టువస్త్రాలతో రాజన్న ఆలయానికి వచ్చిన ఆది శ్రీనివాస్‌కు ఆలయ ఈవో వినోద్‌రెడ్డి ఘనస్వాగతం పలికారు. ఆలయంలోకి ప్రవేశించి రాజన్న ప్రత్యేకపూజలో పాల్గొన్నారు. అనంతరం అద్దాల మండపంలో ఆలయ అర్చకులు ఆశీర్వచనం ఇవ్వగా, ఆలయ ఈవో రాజన్న ప్రసాదాన్ని అందజేశారు.



రాజన్నకు పట్టు వస్త్రాలు తీసుకువస్తున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

పూడ్చిన మృత శిశువుకు పోస్టుమార్టం

ఎల్లారెడ్డిపేట, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లగొల్లపల్లిలోని ఓ యువతి జన్మనిచ్చిన పసికందును ఎవరికీ తెలియకుండా మానేరు వాగులో పూడ్చివేయగా, పోలీసులు పోస్టుమార్టం నిర్వహించారు. సిరిసిల్ల శివారులోని మానేరు వాగులో ఆలస్యంగా వెలుగు చూసింది. పోలీసులు, తహసీల్ అధికారుల కథనం మేరకు.. ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లగొల్లపల్లిలోని ఓ యువతికి అదే గ్రామంలోని యువకుడితో పరిచయమై ప్రేమ దాకా వెళ్లింది. పెళ్లి ఊసు ఎత్తగానే ప్రియుడు ముఃఖం చాటేశాడు. తనకు న్యాయం చేయాలని యువతి పోలీసులను ఆశ్రయించింది. కేసు నమోదు చేసి యువకుడిని రిమాండ్‌కు తరలించారు. అప్పటికే యువతి గర్భం దాల్చడంతో ఆమెను కరీంనగర్‌లోని ప్రభుత్వ సంరక్షణ కేంద్రానికి తరలించారు. ఇటీవల యువతికి పురిటినొప్పులు రావడంతో ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించారు. ఆమె మృత ఆడశిశువుకు జన్మనివ్వడంతో కుటుంబ సభ్యులు కనులు తెరవని ఆడ శిశువును గుట్టు చప్పుడు కాకుండా సిరిసిల్లలోని మానేరు వాగులో ఇసుకలో పూడ్చివేశారు. అనుమానం వచ్చిన పోలీసులకు రాచర్లగొల్లపల్లిలోని యువతి ఇంటికి వెళ్లి ఆరోగ్య విషయంపై ఆరా తీశారు. ఇంటికి తాళం వేసి ఉండడం వల్ల ఏం జరిగిందోనని దర్యాప్తు ప్రారంభించారు. యువతి కుటుంబ సభ్యుల ద్వారా జరిగిన విషయం తెలుసుకున్నారు. ఎల్లారెడ్డిపేట రూరల్ సీఐ శ్రీనివాస్‌గౌడ్, తహసీల్దార్ రామచంద్రం ఆధ్వర్యంలోని సిబ్బంది ఘటన స్థలానికి చేరుకుని పూడ్చివేసిన శిశువు మృతదేహాన్ని వెలికితీయించారు. వైద్యుల సమక్షంలో పోస్టుమార్టం నిర్వహించి నమూనాలను సేకరించారు. డీఎన్ఏ పరీక్షల నిమిత్తం తరలించామని అధికారులు పేర్కొన్నారు.

ఆత్మహత్య చేసుకున్న మృతుల గుర్తింపు



గోలేటి శ్వేత



మినుగు రాహుల్

జమ్మికుంట రూరల్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట మండలం బిజిగిరిషరీఫ్-పాపయ్యపల్లి గ్రామాల మధ్య రైల్వే ట్రాక్‌పై శనివారం రాత్రి ఓ యువతి, యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన విషయం తెలిసిందే. యువకుడి ఆచూకీ రాత్రి తెలియరాగా, యువతి ఆచూకీని రైల్వేపోలీస్‌లు ఆదివారం వెల్లడించారు. ఇల్లందకుంట మండలం రాచపల్లి గ్రామానికి చెందిన మినుగు రాహుల్(18) ఎల్ఈడీ బల్బ్‌ల ఈవెంట్ వర్క్‌చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. నిర్మల్ జిల్లా ఖానాపూర్ మండలం ఎర్వాచింతల్ గ్రామానికి చెందిన గోలేటి శ్వేత(20) కరీంనగర్ ఉమెన్స్ డిగ్రీకళాశాలలో ప్రథమ సంవత్సరం చదువుతోంది. అక్కడే ఓప్రైవేట్ హాస్టల్‌లో ఉంటోంది. రాహుల్ ఈవెంట్‌పై కరీంనగర్‌కు వెళ్లిన సమయంలో ఇద్దరిమధ్య పరిచయం ఏర్పడినట్లు తెలుస్తోంది. రాహుల్ కంటే శ్వేతకు రెండేళ్ల వయస్సు ఎక్కువ ఉండటంతో పెద్దలు ఒప్పుకుంటారోలేదో అని మనస్థాపానికి గురైనట్లు తెలుస్తోంది. రాహుల్ సాయంత్రం 4గంటల సమయంలో ఇంటి నుంచి బయటకు రాగా, శ్వేత ఉదయం 8గంటలకు తండ్రికి ఫోన్‌చేసి కళాశాలకు వెళ్తున్నట్లుచెప్పింది. మళ్లీ11గంటల సమయంలో తండ్రిఫోన్‌చేస్తే స్విచ్‌ఆఫ్ వచ్చింది. అప్పటి నుంచి మళ్లీఫోన్ ఆన్‌కాలేదు. మరుసటి రోజు పోలీస్‌లనుంచి సమాచారం అందడంతో ఆత్మహత్య చేసుకున్న విషయం తెలిసిందని మృతురాలి కుటుంబ సభ్యులు తెలిపారు. తమ కుమార్తె ఏ కారణం చేత ఆత్మహత్య చేసుకుందో తెలియదనిమృతురాలి తండ్రి రాజలింగు పోలీస్‌లకు ఫిర్యాదుచేశాడు. తమకుమారుడు ప్రేమవ్యవహారంతో ఆత్మహత్య చేసుకున్నాడని మృతుడి తండ్రి రాజు పోలీస్‌లకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే ఎస్సై మహేందర్ తెలిపారు.

రైతులను బెంబేలెత్తిస్తున్న హైనా

● ప్రాణాలు కోల్పోతున్న పశువులు
● అటవీఅధికారులు చర్యలు చేపట్టాలని వేడుకోలు

చిగురుమామిడి, మార్చి 16: మండలంలో హైనాదాడులతో రైతులు బెంబేలెత్తిపోతున్నారు. సుందరగిరి, కొండపూర్, బొమ్మనపల్లి, పీచుపల్లి, గాగిరెడ్డిపల్లి, మూదిమాణిక్యం, రామంచ, ఇందుర్తి, నవాబుపేట తదితర గ్రామాల్లో పశువులపై హైనాదాడులు నిత్యకృత్యమయ్యాయి. ఉదయం పూట వ్యవసాయ బావుల వద్దకు వెళ్లేందుకు రైతులు జంకుతున్నారు. రాత్రిపూట పశువుల కొట్టాల్లో కట్టేసిన పశువులు తెల్లవారే సరికి ఉంటాయే లేదోనని రైతులు తీవ్ర భయాందోళనలు చెందుతున్నారు. అటవీ శాఖ అధికారులు రక్షణచర్యలు చేపట్టి హైనాదాడులను నివారించాలని మండల రైతులు కోరుతున్నారు. రెండు హైనాలు కలిస్తే మనుషులపైన కూడా దాడులు చేసే అవకాశం ఉందన్నారు. దీంతో వ్యవసాయ బావుల వద్దకు వెళ్లలేక పోతున్నామని రైతులు పేర్కొంటున్నారు. నష్టపోయిన రైతులందరికీ పరిహారం ఇవ్వడం కాకుండా శాశ్వత రక్షణ చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.



కొండపూర్‌లో హైనా దాడిలో మృతిచెందిన లేగ (ఫైల్)

హైనా దాడులను నివారించాలి..

తాళ్లపెల్లి తిరుపతిగౌడ్, రైతు, సుందరగిరి



మండలంలో ఇటీవల హైనా దాడుల్లో అనేక లేగ దూడలు, ఆవులు చనిపోయాయి. హైనా వరుస దాడులతో మండలంలో రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. రాత్రి సమయాల్లో బావుల వద్దకు వెళ్లలేని పరిస్థితిలో రైతులు ఉన్నారు. సంబంధిత శాఖ అధికారులు, సిబ్బంది, రెవెన్యూ అధికారులు ఉమ్మడిగా హైనాల స్థావరాలను గుర్తించాలి. దీంతో మండలంలో హైనా దాడులు నివారణ జరుగుతుంది.

హైనాలను పట్టుకోవాలి.. అందె స్వామి, మాజీ జడ్పీటీసీ



ఇటివల మండలంలో అనేక గ్రామాల్లో హైనా దాడులు జరిగాయి. రైతులు వ్యవసాయ బావుల వద్దకు వెళ్లేందుకు జంకుతున్నారు. హైనా దాడులను నివారించేందుకు ప్రత్యేకంగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి వాటి పట్టేయాలి. పశువులపై చేసిన విధంగానే హైనాలు మనుషులపై కూడా దాడులు చేసే అవకాశం ఉందని రైతులు భయపడుతున్నారు.

పశువైద్యంపై పట్టింపేది?

● పత్తా లేని గొర్రె, మేకల నట్టల నివారణ మందులు



రామడుగు మండల కేంద్రంలోని పశువైద్య కేంద్రం



రామడుగులో పశువులకు వైద్యం చేస్తున్న వైద్య సిబ్బంది

రామడుగు, మార్చి 16(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరి కారణంగా పశువులకు సరైనమందులు అందడం లేదన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. మండలంలో రెండు ప్రాథమిక పశువైద్యాకేంద్రాలు, ఒక ఉపకేంద్రం ఉంది. గత ప్రభుత్వం పశువుల వైద్యానికి పూర్తిస్థాయిలో నిధులు కేటాయించలేదని ఆరోపణలు ఉండగా, ప్రస్తుత ప్రభుత్వం కూడా అదే వైఖరిని కొనసాగిస్తోందని పాడిరైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

● సమయానికి రాని మందులు..

మండలంలో 7వేల గేదెలు, ఆవులు ఉండగా, 30వేల మేకలు, గొర్రెలు ఉన్నాయి. అయితే రెండేళ్లుగా గొర్రెల, మేకలకు నట్టల నివారణ మందులు వేసిన దాఖలాలు లేవు. దీంతోపాటు పశువైద్యకేంద్రాలకు మూడు నెలలకొకసారి రావాల్సిన మందులు అటకెక్కాయి. సంవత్సరానికి ఒకటి లేదా రెండు సార్లు మందులు సరఫరా చేస్తున్న అవి సరైన సమయానికి రావడం లేదని తెలుస్తోంది. సీజన్‌లో వేయాల్సిన మందులు తర్వాత రావడంతో అవి పెద్దగా ఉపయోగపడటం లేదని తెలుస్తోంది.

● మూగజీవాల అరణ్య రోదన..

సునందిని పథకం కింద దూడలకు దాన ఇచ్చే పరిస్థితి ఉండేది. ప్రస్తుతం ఆ పథకం అటకెక్కింది. పశుబీమాను పట్టించుకునే నాథుడు కరువయ్యాడు. మినీషిప్ యూనిట్లు లేకుండా పోయాయి. నట్టలనివారణ మందులు రెండేళ్లుగా సరఫరా చేయకపోవడంతో పశువులకు వాటిని అందజేసే పరిస్థితి లేకుండా పోయింది. గతంలో గిరిరాజా కోళ్లతోపాటు గొర్రెకాపరులకు గొర్రెలు అందజేయగా, ప్రస్తుతం వాటి ఊసే లేకుండా పోయింది. ఎస్సీలకు ప్రత్యేక పథకం కింద పాడిగేదెలు అందజేయగా నేడు మంజూరు చేసే పరిస్థితి లేకుండా పోయింది. ఎస్సీలకు పాడి పశువులకు పంపిణీ చేసేందుకు 150 యూనిట్లు మంజూరు కాగా, అవి ఇప్పటివరకు మంజూరు కాలేదు. వ్యవసాయరంగం అభివృద్ధి సాధించాలంటే పశుగుణావృద్ధి ఎంతో అవసరం ఉండగా, వాటిని పట్టించుకునే పరిస్థితులు లేకపోవడంతో పశువుల సంఖ్య రోజురోజుకు తగ్గుతోంది. ఈ పరిస్థితి ఇలానే ఉంటే గ్రామీణప్రాంతాల్లో పశువుల అభివృద్ధి, పశువుల పెంపకం అభివృద్ధిపై రైతుల ఆశలు సన్నగిల్లే పరిస్థితి ఉంది. ప్రభుత్వం పశువులకు ఉచితక్యాంపు నిర్వహించాలని పాడి రైతులు కోరుతున్నారు.

● సంవత్సరానికి రెండుసార్లు మందుల సరఫరా..

- డాక్టర్ అనిల్, పశువైద్యాధికారి, రామడుగు



సంవత్సరానికి నాలుగుసార్లు రావాల్సిన మందులు రెండు సార్లు వస్తున్నాయి. ప్రభుత్వం అందించే మందులతో పశువులకు ఇబ్బందులు లేకుండా వైద్యసేవలు అందిస్తున్నాం. గొర్రె,మేకల నట్టల నివారణ మందులు లేకపోవడంతో ఆ కార్యక్రమాన్ని నిర్వహించడం లేదు.

బస్తీవాసుల అండతో.. ఒక్కటైన దివ్యాంగ జంట



బస్తీవాసుల సమక్షంలో వివాహం చేసుకుంటున్న దివ్యాంగులు

బెల్లంపల్లి, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): వాళ్లిద్దరూ దివ్యాంగులు. ఒకరికి పుట్టుకతోనే అంధత్వం, మరొకరికి చిన్నతనంలోనే పోలియో. వారిని వివాహం చేసుకోవడానికి ఎవరు ముందుకు రాలేదు. దీంతో బస్తీవాసులందరు పెద్దమనసు చేసుకుని ముందుకు వచ్చి వివాహం జరిపించారు. మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి పట్టణంలోని బూడిదగడ్డ బస్తీకి చెందిన తమ్మిడి భాగ్యమ్మ, సత్తయ్య కూతురు ప్రేమలత చిన్నప్పటి నుంచి పోలియోతో రెండు కాళ్లు చచ్చుబడి నడవలేకుండా ఉంది. పెద్దపల్లి జిల్లా ఆదివారంపేట మండలానికి చెందిన కస్తూరి రాయమల్లమ్మ, ఓదెలు రెండవ కుమారుడు రమేశ్ పుట్టుకతోనే అంధుడు. ఇద్దరు దివ్యాంగులు కావడంతో ఇద్దరికి వివాహం కావడం లేదు. ఈ క్రమంలో బూడిదగడ్డ బస్తీకి చెందిన బస్తీవాసులు వీరిద్దరికి వివాహం చేయాలని నిశ్చయించారు. ఆ ఇద్దరి అభిప్రాయాన్ని తీసుకున్నారు. నిరుపేదలు కావడంతో బస్తీవాసులే పెళ్లికి కావాల్సిన ఖర్చులు భరించారు. అన్నీ తామై బెల్లంపల్లి పట్టణంలోని శివాలయంలో ఆదివారం ఘనంగా వివాహం జరిపించారు. పుస్తెల నుంచి భోజనం వరకు అయ్యే ఖర్చు నంతా తలో చేయి వేసి బాగస్వాములు వివాహం జరిపించారు.

రేణుకాదేవి ఆలయంలో చోరీ

ఇల్లంతకుంట, మార్చి 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని రేపాక గ్రామంలోని రేణుకఎల్లమ్మ దేవి ఆలయంలో చోరీజరిగింది. ఆలయానికి వేసిన తాళాలను పగులగొట్టి దొంగలు హుండీని ఎత్తుకెళ్లారు. సంఘటన స్థలాన్ని పోలీసులు పరిశీలించి కేసులు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

అగ్నిపథ్-2025 ఉద్యోగాలకు దరఖాస్తుల ఆహ్వానం

కరీంనగర్ స్పోర్ట్స్, మార్చి 16(ఆంధ్రజ్యోతి): ఇండియన్ ఆర్మీలో అగ్నిపథ్ 2025-26 సంవత్సరానికి అగ్నివీర్‌ల నియామకాలకు అవివాహిత యువకుల నుంచి భారత సైన్యం దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. ఈ ఏడాది ఏప్రిల్ 10లోగా అభ్యర్థులు దరఖాస్తులను ఆన్‌లైన్‌లో సమర్పించాలి. ఆన్‌లైన్ పరీక్ష జూన్‌లో నిర్వహించనున్నారు. అగ్నివీర్ జనరల్, అగ్నివీర్ టెక్నికల్, అగ్నివీర్ క్లర్క్/స్టోర్ కీపర్, టెక్నికల్ ట్రేడ్‌మెన్(10వ తరగతి పాస్), అగ్నివీర్ ట్రేడ్‌మెన్(8వ తరగతిపాస్), కేటగిరీల్లో అభ్యర్థుల ఎంపిక ఉంటుంది. అభ్యర్థులు అర్హత ఆధారంగా ఏదైన రెండు కేటగిరీలకు మాత్రమే దరఖాస్తు చేసుకోవచ్చు. మరిన్ని వివరాలకు ఇండియన్ ఆర్మీ వెబ్‌సైట్‌లోగానీ, సికింద్రాబాద్‌లోని ఆర్మీ రిక్రూట్‌మెంట్ కార్యాలయం, 040 27740059 నంబరులోగానీ సంప్రదించవచ్చు.

నేడు శ్రీభాష్యం విజయసారథి రాష్ట్రీయ సంస్కృత పురస్కారం ప్రదానం

కరీంనగర్ కల్చరల్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): శ్రీభాష్యం విజయసారథి రాష్ట్రీయ సంస్కృత పురస్కారాన్ని సోమవారం సంస్కృత అకాడమి, సర్వ వైదిక సంస్థానం ట్రస్టు సంయుక్త నిర్వహణలో హైదరాబాద్‌లోని సంస్కృత అకాడమిలో ప్రదానం చేయనున్నట్లు సంస్థానం మేనేజింగ్ ట్రస్టీ శ్రీభాష్యం వరప్రసాద్ తెలిపారు. ఏటా జాతీయ స్థాయిలో ఒక సంస్కృత పండితుడికి పురస్కారం అందజేస్తున్నట్లు, ఈ ఏడాది ఒరిస్సాకు చెందిన ఆచార్య హరేకృష్ణ శతపతి ఎంపికైనట్లు పేర్కొన్నారు. హరేకృష్ణ ప్రస్తుతం కేంద్ర సాహిత్య అకాడమి సంస్కృత భాషా సలహా మండలి కన్వీనర్‌గా వ్యవహరిస్తున్నట్లు తెలిపారు.

వృద్ధులు చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలి

సీనియర్ సిటిజన్స్ రాష్ట్ర కార్యదర్శి హరి అశోక్ కుమార్

కోరుట్ల రూరల్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): వృద్ధులు చట్టాలపై అవగాహన పెంపొదించుకోవాలని సీనియర్ సిటిజన్స్ రాష్ట్ర కార్యదర్శి హరి అశోక్ కుమార్ అన్నారు. ఆదివారం మండలంలోని కల్లూర్ గ్రామ శివారులోని శివసాయి ఫంక్షన్ హాల్‌లో వయోవృద్ధుల చట్టాలపై అవగాహన కల్పించారు. కోరుట్ల డివిజన్ సీనియర్ సిటిజన్స్, పెన్షనర్ అసోసియేషన్ సంఘ అధ్యక్షుడు పబ్బాశివానందం జన్మ దిన వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా పబ్బా శివానందను సత్కరించారు. కార్యక్రమంలో సీనియర్ సిటిజన్స్ సభ్యులు హన్మంతరెడ్డి, గంటేడి రాజ్‌మోహన్, చిలుక గంగారాం, రాజేశ్వర్,సాబితలి, లక్ష్మీనారాయణ, రాజయ్య, చిన్న మల్కయ్య, మాజీ సర్పంచ్ వనతడుపుల అంజయ్యలతో పాటు పలువురు పాల్గొన్నారు.

- ఉమ్మడి జిల్లాలో పెరుగుతున్న ఉష్ణోగ్రతలు
- ప్రజలను అప్రమత్తం చేస్తున్న వైద్య ఆరోగ్య శాఖ

వడదెబ్బతో జర జాగ్రత్త



జగిత్యాల, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. జగిత్యాల జిల్లా వ్యాప్తంగా 38డిగ్రీల నుంచి 42 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదు కావడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. ఈ వేసవి సీజన్‌లో సాధారణ ఉష్ణోగ్రతల కంటే దాదాపు మూడు నుంచి ఆరు డిగ్రీల వరకూ అధికంగా నమోదు అవుతున్నట్లు వాతావరణ శాఖ గణాంకాలు వెల్లడిస్తున్నాయి. దీంతో వృద్ధులు, చిన్నారులు, మహిళలు ఎక్కువగా వడదెబ్బకు గురయ్యే అవకాశాలున్నాయి. జిల్లాలో వారం రోజులుగా



ఎండలో బయటకు వెళ్లవద్దని సూచిస్తున్న వైద్య అధికారులు, సిబ్బంది

ఎండ వేడిమి తీవ్రత ఎక్కువైంది. ప్రజలు వడదెబ్బ బారిన పడకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యాధికారులు విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తున్నారు. వడదెబ్బకు గుర య్యే కారణాలు, వడ దెబ్బ లక్షణాలు, నివారణకు తీసుకోవాల్సిన చర్యలు, ముందస్తు జాగ్రత్తలను జగి త్యాల జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో వైద్యాధి కారులు, ఆరోగ్య సిబ్బంది విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు.

● వడదెబ్బ లక్షణాలు..

శరీరంలో నీటి శాతం లోపిస్తుంది. శరీర ఉష్ణోగ్రత బాగా పెరుగుతుంది. వడదెబ్బ ప్రభావం ఎక్కువగా ఉంటే వాంతులు, విరేచనాలు ఏర్పడు తాయి. దాహం ఎక్కువగా ఉంటుంది. తల తిరగడం, మతి కోల్పో వడం వంటి లక్షణాలు కనిపి స్తాయి. గుండె లయ తప్పుతుంది. ఈ పరిస్థితిని తట్టుకోలేకపోతే మరణాలు కూడా సంభవిస్తాయని వైద్యులు అంటున్నారు.

● పాటించాల్సిన జాగ్రత్తలు..

వడదెబ్బకు గురయినప్పుడు శరీరాన్ని వేగంగా చల్లబరిచే ప్రయత్నం చేయాలి. వడదెబ్బ తగిలిన వ్యక్తిని చల్లని ప్రదేశంలోకి తీసుకెళ్లాలి. దుస్తులను వదులుగా చేసి తడి గుడ్డతో ఒళ్లంతా తుడవాలి. రోగికి తగినంత గాలి ఆడేటట్లు చేయాలి. రోజుకు ఐదు, ఆరు లీటర్లకు తగ్గకుండా నీరు తాగాలి. ఉప్పు కలిపిన ద్రవాలు లేదా ఓఆర్ఎస్ ద్రావణం త్రాగాలి. కాటన్ దుస్తులను ధరించాలి. నూనె పదార్థాల వాడకం తగ్గించాలి. కొబ్బరి బోండాం, మజ్జిగ తాగడం మంచిది. సలాడ్స్, తాజా కాయగూరలు, ఫ్రూట్ జ్యూస్‌లు తీసుకోవడం మంచిది. వడదెబ్బ తగలకుండా ఉండాలంటే ఎండలో బయటకు వెళ్లేటప్పుడు తలకు క్యాప్ పెట్టుకోవాలి. బయటకు వెళ్లేటప్పుడు తప్పకుండా కూలింగ్ అద్దాలు పెట్టుకోవాలి.

ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి

-డాక్టర్ ప్రమోద్ కుమార్, జిల్లా వైద్యాధికారి, జగిత్యాల



వడదెబ్బ తగలకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి. జిల్లాలోని అన్ని ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాల్లో ప్రతినిత్యం వైద్య సిబ్బంది అందుబాటులో ఉంటున్నారు. వడదెబ్బ తగిలిన వారిని గుర్తించిన వారు వెంటనే 108కు సమాచారం అందించాలి. అంగన్‌వాడీ కేంద్రాల్లో, ఉపాధిహామీ పని ప్రాంతాల్లో ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచుతున్నాం. అవసరమున్న వారు సంబంధిత సమీప కేంద్రాల్లో ఉచితంగా పొందవచ్చు.

అర్బన్ బ్యాంకు సభ్యులకు రెండు లక్షల బీమా

- కరీంనగర్ సహకార అర్బన్ బ్యాంకు పీఐసీ చైర్మన్ గడ్డం విలాస్‌రెడ్డి



మాట్లాడుతున్న బ్యాంకు పీఐసీ చైర్మన్ గడ్డం విలాస్‌రెడ్డి

కరీంనగర్‌టౌన్, మార్చి 16(ఆంధ్రజ్యోతి): బ్యాంకుసభ్యులు, ఖాతాదరులు, వినియోగదారుల సహకారంతో ది కరీంనగర్ సహకార అర్బన్ బ్యాంకు లాభాలతో ముందుకెళ్తోంది. బ్యాంకు అభివృద్ధికి సలహాలు, సూచనలందిస్తూ సహకరిస్తున్న బ్యాంకు సభ్యులకు రెండు లక్షల రూపాయల బీమా సౌకర్యాన్ని వర్తింపజేస్తామని బ్యాంకు పీఐసీ చైర్మన్ గడ్డం విలాస్‌రెడ్డి ప్రకటించారు. ఆదివారం నగరంలోని రెవెన్యూ గార్డెన్స్‌లో ఏర్పాటు చేసిన అర్బన్ బ్యాంకు మహాజన సభలో మాట్లాడారు. బ్యాంకింగ్ రంగంలో నెలకొన్న పోటీని తట్టుకునే విధంగా బ్యాంకు కార్యకలాపాలను విస్తరించాల్సిన అవసరముంద న్నారు. త్వరలోనే హుస్నాబాద్, చొప్పదండిలో కొత్తగా బ్రాంచీలను ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు. బ్యాంకుకు మూల స్తంభాలైన సభ్యులకు రెండు సంవత్సరాల డివిడెండ్‌ను ఏప్రిల్ నుంచి నగదు రూపంలో అందజేస్తామన్నారు. కరీంనగర్ ప్రధాన కేంద్రంగా పనిచేస్తున్న ఈ బ్యాంకుకు జగిత్యాలలో ఒక బ్రాంచి ఉందని, ఇటీవల గంగాధరలోనూ కొత్తగా బ్రాంచ్ ఏర్పాటు చేశామని తెలిపారు. బ్యాంకులో డిపాజిట్లను పెంచుకోవడంతోపాటు రుణాల మంజూరు, రికవరీపై దృష్టిసారిస్తున్నట్లు చెప్పారు. బ్యాంకును మరింత అభివృద్ధి బాటలో నడిపించేందుకు పాలకవర్గం, ఉద్యోగులు, సిబ్బంది సహకారంతో కృషి చేస్తామన్నారు. బ్యాంకులో మార్టిగేజ్ రుణాలను రూ.20 లక్షలకు పెంచడంతోపాటు బంగారు ఆభరణాలను తాకట్టుపెట్టుకొని ఇచ్చే రుణాలను కూడా మార్కెట్ రేట్లకు అనుగుణంగా సవరిస్తామన్నారు. కరీంనగర్ నగరపాలక సంస్థ పరిధిలోకి కొత్తపల్లి మున్సిపాలిటీతోపాటు శివారు గ్రామాలను విలీనం చేస్తూ నగర పరిధిని విస్తరించినందున బ్యాంకు సేవలను కూడా 20 కిలో మీటర్ల పరిధిలోకి విస్తరిస్తామన్నారు. సమావేశంలో పాలకవర్గ సభ్యులు మడుపు మోహన్, ముక్క భాస్కర్, బొమ్మరాతి సాయికృష్ణ, ముద్దసాని క్రాంతి, రేగొండ సందీప్, మూల లక్ష్మీరవీందర్‌రెడ్డి, విద్యాసాగర్, లక్ష్మణ్‌రాజు, మహ్మద్ సమీయుద్దీన్, మంగి రవీందర్, నాగుల సతీష్, మార్క రాజు, గంజి అంజయ్య, బ్యాంకు సీఈవో నునుగొండ శ్రీనివాస్, ఎలుక సుధాకర్, సభ్యులు ముప్పిడి సునీల్, ఆది మల్లేశం, కల్యాడపు ఆగయ్య, రాంచంద్రం పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలి

సుభాష్‌నగర్, మార్చి 16(ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్‌రెడ్డి మాదిగలకు ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు బెజ్జంకి అనిల్ అన్నారు. కలెక్టరేట్ ఎదుట చేపట్టిన దీక్ష శిబిరంలో ఆదివారం మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణను ప్రతీ ఉద్యోగ నోటిఫికేషన్ వర్తింపజేస్తామని అసెంబ్లీలో హామీ ఇచ్చినట్లు తెలిపారు. వర్గీకరణ కోసం ఈనెల 17న అసెంబ్లీలో చట్టం చేస్తామని చెబుతూనే మరోవైపు ఉద్యోగాల పరీక్షల ఫలితాలు విడుదల చేస్తున్నారని, ద్వంద వైఖరి అవలంబిస్తున్నారని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాటలకు చేతలకు పొంతనలేకుండా పోయిందన్నారు. ఎస్సీ రిజర్వ్‌డ్ ఉద్యోగాలన్నీ మాల సామాజిక వర్గానికి దోచిపెట్టడానికే రేవంత్‌రెడ్డి కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. ఇచ్చిన మాటకు కట్టుబడి వెంటనే చట్టం చేసి అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఎస్సీ వర్గీకరణ అమల్లోకి వచ్చే వరకు పోరాటం ఆగదన్నారు. ఈ దీక్షలో కనకం అంజిబాబు, వరలక్ష్మి, కొత్తూరి రాజయ్య, శెనిగరపు హన్మయ్య, రేపాక బాబు, అలవాల సంపత్, గాలి మొగిలి, నక్క లక్ష్మణ్, గుడిసె విజయ్, గంగాధర రఘు, తడగొండ రమేశ్, కోడూరి మహేశ్, గాలిపెల్లి కొమురయ్య, భూత్కూరి యాకోబు, బోయినిపల్లి చంద్రయ్య, మ్యాక రాజు, పులిపాక కిషన్, వేల్పుల చిలుకమ్మ, గాలి బుచ్చమ్మ, బి.రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులు దేశం గర్వపడేలా రాణించాలి

● రాష్ట్ర స్థాయి హాకీ పోటీలు ప్రారంభం ● ఉమ్మడి 10 జిల్లాల నుంచి క్రీడాకారులు రాక ● హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి



హాకీ టోర్నమెంట్‌లో తలపడుతున్న కరీంనగర్-రంగారెడ్డి జట్లు



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి, వొడితెల ప్రణవ్

హుజూరాబాద్, మార్చి 16(ఆంధ్రజ్యోతి): హాకీ క్రీడకారులు దేశం గర్వపడేలా రాణించాలని హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి అన్నారు. ఆదివారం హుజూరాబాద్‌లోని హైస్కూల్ మైదానంలో రాష్ట్రస్థాయి హాకీ మెన్ క్రీడాపోటీలను ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి, కాంగ్రెస్‌పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జీ వొడితెల ప్రణవ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి మాట్లాడుతూ హుజూరాబాద్ హాకీక్రీడాకారులు 30 ఏళ్లుగా జాతీయ, రాష్ట్రస్థాయిల్లో ఉత్తమప్రతిభ కనబరుస్తున్నారన్నారు. క్రీడలతో మానసికోల్లాసం, శారీర దారుఢ్యం పెరుగుతుందన్నారు. క్రీడలు స్నేహభావాన్ని పెంపొందిస్తా యన్నారు. క్రీడాకారుల కోసం కాంగ్రెస్ ప్రభుత్వం మినీస్టేడియం నిర్మించాలని డిమాండ్ చేశారు. అనంతరం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీఇన్‌చార్జీ వొడితెల ప్రణవ్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం క్రీడలకు అధికప్రాధాన్యత ఇస్తుందన్నారు. కార్య క్రమంలో కరీంనగర్ మాజీమేయర్ సర్దార్ రవీందర్ సింగ్, జిల్లాఅసోసియేషన్ సెక్రెటరీ సర్దార్ సురేందర్‌సింగ్, సర్దార్‌కల్యాణ్‌సింగ్, బి శ్రీనివాస్, రాధిక, శ్రీనివాస్, తోటరాజేంద్ర ప్రసాద్, సమ్మయ్య, రవీందర్, బాలరాజు, సాయికృష్ణ, రమేష్, శ్యాంసుందర్, ప్రభాకర్, రాజేష్, వినయ్, విక్రమ్ తదితరులు పాల్గొన్నారు.

● క్రీడా పోటీల వివరాలు..

జరుగుతున్న రాష్ట్రస్థాయి హాకీ పోటీల్లో గ్రూప్-ఏలో రంగారెడ్డిపై కరీంనగర్ జట్టు7-1, ఖమ్మంపై హైదరాబాద్ 10-0, రంగారెడ్డిపై వరంగల్ 6-1, ఖమ్మంపై కరీంనగర్ 6-2, హైదరాబాద్‌పై వరంగల్‌జట్టు 3-2తో విజయం సాధించాయి. గ్రూప్-బీలో నల్గొండపై ఆదిలాబాద్8-0, నిజామాబాద్‌పై మెదక్6-1, మహబూబ్‌నగర్‌పై ఆదిలాబాద్ జట్టుతలపడగా డ్రాగా ముగిసింది. నల్గొండపై మెదక్ 11-0, మహబూబ్‌నగర్‌పై నిజామాబాద్ 3-2తో విజయం సాధించాయి. ప్రతిమ్యాచ్‌లో మ్యాన్‌ఆఫ్‌ది మ్యాచ్ అందించారు.

ఘనంగా వేంకటేశ్వర స్వామి డోలోత్సవం

ధర్మపురి, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి క్షేత్రంలో బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం వేంకటేశ్వర స్వామి తెప్పోత్సవం, డోలోత్సవం ఘనంగా జరిగింది. ఆలయ వేద పండితులు బొజ్జ రమేష్ శర్మ తదితర వేద బ్రాహ్మణుల మంత్రోచ్చరణల మధ్య స్వామి వారల ఉత్సవమూర్తిని సేవలపై ఆశీనులు చేశారు. అనంతరం పురవీదుల గుండా బ్రహ్మ పుష్కరిణి (కోనేరు)కు తీసుకువచ్చారు. బ్రహ్మ పుష్కరిణి నీటిలో హంస వాహన రూపంలో గల నూతన పడవ పైన ఉంచిన స్వామి వారల సేవలను ఐదుసార్లు ప్రదక్షిణాలు చేయించి అర్చకులు తెప్పోత్సవం జరిపారు. అనంతరం బ్రహ్మ పుష్కరిణి మధ్య గల మండపంలోని ఊయలపై ఆశీనులు చేసి అర్చకులు సనాతన సాంప్రదాయ రీతిలో డోలోత్సవం జరిపారు. ఆలయ ఉప ప్రధాన అర్చకులు నేరెళ్ల శ్రీనివాసాచార్య ఆధ్వర్యంలో ఉత్సవ కార్యక్రమాన్ని కొనసాగించారు. ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్



ధర్మపురి బ్రహ్మపుష్కరిణిలో వేంకటేశ్వరుడి డోలోత్సవం

కుమార్, ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్, ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, ధర్మకర్తల మండలి సభ్యులు, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ ఎల్లాల శ్రీకాంత్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు. ధర్మపురి సీఐ రాంనర్సింహరెడ్డి ఆధ్వర్యంలో ఎస్ఐ ఉదయ్‌కుమార్, శ్రీధర్, ఉమాసాగర్, సతీష్, దత్తాత్రి, కుమారస్వామి, పోలీస్ సిబ్బంది బందోబస్తు నిర్వహించారు.

● ఆరో రోజు రూ.6.58 లక్షల ఆదాయం

బ్రహ్మోత్సవాల్లో భాగంగా శ్రీ లక్ష్మీ నరసింహస్వామి ఆలయానికి ఆరో రోజు రూ.6,58,000 ఆదాయం లభించినట్లు ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్ తెలిపారు. ఇందు లో వివిధ రకాల పూజల టిక్కెట్లు విక్ర యించగా రూ.2,95,223, ప్రసాదాలు విక్రయిం చగా రూ.2,96,525 లభించాయి. అన్నదానం కోసం భక్తులు సమర్పించిన విరాళాలు రూ. 66,252 ఉన్నట్లు ఆయన పేర్కొన్నారు.

● బ్రహ్మోత్సవాల్లో నేడు

బ్రహ్మోత్సవాల్లో సోమవారం సాయంత్రం 4 గంటలకు శ్రీ లక్ష్మీ నృసింహస్వామి ఉత్తర దిగ్యాత్ర, రాత్రి 8 గంటలకు భోగ మండపం, 9 గంటలకు వేదసదస్సు ఉత్సవం ఉంటుంది. శేషప్ప కళావేదికపై రాత్రి వేళలో 7 గంటల నుండి సంగీత విద్యాంసులు కొరిడె నరహరి, జ్యోతిచే శాస్త్రీయ సంగీతం, రాత్రి 9 గంటలకు వేదసదస్సు, భోగమండప ఉత్సవం కార్యక్రమాలు ఉంటాయని ఆలయ ఈవో తెలిపారు.

● లక్ష్మీ నృసింహస్వామి దక్షిణ దిగ్యాత్ర

లక్ష్మీ నృసింహస్వామి దక్షిణ దిగ్యాత్ర కార్యక్రమాన్ని సాయంత్రం ఘనంగా నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా కల్యాణం, తెప్పె, డోలోత్సవాల అనంతరం స్వామి వారలు దక్షిణం వైపు విహార యాత్రకు బయలుదేరే కార్యక్రమాన్ని దక్షిణ దిగ్యాత్రగా చెబుతుంటారు. ఈ దిగ్యాత్రలో భాగంగా శ్రీ లక్ష్మీ నృసింహస్వామి (యోగ, ఉగ్ర) వారల ఉత్సవ మూర్తులను ఆలయం నుంచి బయటకు తీసుకు వచ్చారు. అనంతరం సేవలపై ఉంచి మంగళ వాయిద్యాలు వెంట రాగా దక్షిణ దిశలో గల పోలీస్ స్టేషన్ వైపు తీసుకువెళ్లారు. జగిత్యాల డీఎస్పీ రఘుచందర్, ధర్మపురి సీఐ రాంనర్సింహరెడ్డి, ఎస్ఐలు ఉదయ్‌కుమార్, శ్రీధర్‌రెడ్డి, సతీష్, ఉమాసాగర్ స్వామి వారల సేవలను ఎత్తుకుని లోనికి ప్రవేశించారు. జగిత్యాల డీఎస్పీ, ధర్మపురి సీఐ, ఎస్ఐల దంపతులు ప్రత్యేకంగా పూజల్లో పాల్గొని స్వామి వారలను దర్శనం చేసుకున్నారు.



పోలీస్ స్టేషన్ ఆవరణలో స్వామి వారలకు పూజలు నిర్వహిస్తున్న పోలీసు అధికారులు

కన్నుల పండువగా వేంకటేశ్వరస్వామి కల్యాణం

రామడుగు, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గోపాల్‌రావుపేటలో ఆదివారం వేంకటేశ్వర స్వామి కల్యాణం అంగరంగ వైభవంగా జరిగింది. బ్రహ్మోత్సవాల్లో భాగంగా నిర్వహించిన కల్యాణం వేదపండితుల మంత్రోచ్చరణల మధ్య వందలాది మంది గ్రామస్థుల సమక్షంలో కన్నుల పండువగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లిసత్యం హాజరై ప్రత్యేకపూజలు నిర్వహించారు.



కల్యాణోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

వైభవంగా పెద్దాపూర్ మల్లన్న బోనాలు

- హాజరైన 70వేల మంది భక్తులు
- పూజలు నిర్వహించిన ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

మెట్‌పల్లి రూరల్, మార్చి, 16 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లా మెట్‌పల్లి మండలం పెద్దాపూర్ గ్రామంలోని మల్లన్న స్వామి పుణ్య క్షేత్రంలో బోనాల జాతర ఆదివారం వైభవంగా జరిగింది. ప్రతి ఏటా హోలీ తరువాత వచ్చే మొదటి ఆదివారం గ్రామంలో మల్లన్న జాతర ఉత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహిస్తారు. ఉదయం నుంచి స్వామి వారికి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు, పూజలను ఆలయం ప్రధాన పురోహితుడు ఆసరి మహేష్ నిర్వహించారు. జాతరకు జగిత్యాల, కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్ జిల్లాలతో పాటు మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, కర్ణాటక రాష్ట్రాల నుంచి 70 వేల మంది భక్తులు పాల్గొన్నారు. సాయంత్రం మహిళలు, భక్తులు ఉపవాస దీక్షలతో బోనం కుండలను అలంకరించి నైవేద్యాన్ని తయారు చేశారు. బోనాలను భక్తులు నెత్తిన ఎత్తుకొని శివసత్తుల పూనకాలు, ఒగ్గు కళాకారుల నృత్యాలతో డప్పుచప్పుళ్ల మధ్య ఆలయానికి ఊరేగింపుగా వచ్చారు. అనంతరం ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి స్వామి వారికి బోనం సమర్పించారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఆలయాభివృద్ధి కమిటీ అధ్యక్షుడు మిట్టపల్లి నారాయణరెడ్డి, అధికారులు ఏర్పాట్లు చేశారు. అనంతరం నిర్వహకులు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన రథంలో ఉత్సవమూర్తులను ఆలయ ప్రధాన



ఆలయంలోని ఉత్సవమూర్తులు

పెద్దాపూర్‌లోని మల్లన్నస్వామి ఆలయం చుట్టూ బోనాలతో ప్రదక్షిణలు చేస్తున్న భక్తులు

పురోహితుడు మల్లేష్‌యాదవ్ పట్టుకుని ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన రథంపై



నృత్యాలతో ప్రదక్షిణలు చేస్తున్న శివసత్తులు, ఒగ్గుకళాకారులు

కూర్చోన్నారు. అనంతరం ఆలయం చుట్టూ ప్రదక్షిణ చేయించి జాతరను అంగరంగ వైభవంగా నిర్వహించారు. ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్, మాజీ జడ్పీటీసీ కాటిపెల్లి రాధశ్రీ-శ్రీనివాస్ రెడ్డిలు స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగ కుండా మెట్‌పల్లి డీఎస్పీ రాములు పర్యవేక్షణలో సీఐలు నిరంజన్‌రెడ్డి, సురేష్ ఆధ్వర్యంలో ఎస్సైలు కిరణ్‌గౌడ్, శ్రీకాంత్, శ్యామ్‌రాజ్, నవీన్ బందోబస్తు చర్యలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మారు సాయిరెడ్డి, మాజీ సర్పంచు కోరెపు రవి, వైస్ చైర్మన్లు కచ్చు శ్రీనివాస్, పిల్లి పెద్దమల్లేష్‌యాదవ్, మేర్గు రమేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాలతో నేరాల నియంత్రణ

సురేష్‌బాబు, కోరుట్ల సీఐ



ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

ఆంధ్రజ్యోతి: నేరాల నియంత్రణకు ఏం చర్యలు తీసుకుంటున్నారు?

సీఐ: అన్ని ప్రాంతాల్లో సీసీ కెమె రాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నాం. సీసీ కెమెరాలతో నేరాలు నియం త్రణలోకి వస్తాయి. కెమెరాల ఏర్పాటుపై అన్ని గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. ప్రతి గ్రామంలో సీసీ కెమెరాలతో నిఘా ఉంచి నేరాల నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నాం. గ్రామాల్లో పనిచేయని సీసీ కెమెరాలకు మరమ్మతులు చేయి స్తున్నాం.

ఆంధ్రజ్యోతి: గంజాయి నియంత్రణకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

సీఐ: గంజాయి నియంత్రణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే వారిపై నిఘా పెంచాం. మత్తు పదార్థాలకు యువతీ, యువకులు ఆకర్షితులు కాకుండా అవగాహన సదస్సులను నిర్వహిస్తున్నాం. గంజాయి విక్రయిస్తున్న వారిపై కేసులు నమోదు చేసి జైలుకు తరలించాం.

ఆంధ్రజ్యోతి: సైబర్ నేరాలపై ఎలాంటి అవగాహన కల్పిస్తున్నారు?

సీఐ: సైబర్ నేరాల బారిన పడకుండా గ్రామాలతో పాటు విద్యాసంస్థల్లో ప్రత్యేక అవగాహన సదస్సులను నిర్వహిస్తున్నాం. బాధితులు ఫిర్యాదు చేస్తే తక్షణమే స్పందిస్తున్నాం.

-కోరుట్ల

హత్య కేసులో ఐదుగురి రిమాండ్

జగిత్యాల రూరల్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల రూరల్ మండలం పొలాసలో శనివారం పడాల కమలాకర్ (60) అనే వ్యక్తిని హత్య చేసిన ఘటనలో ఐదుగురు నిందితులను ఆదివారం రిమాండ్‌కు తరలించినట్లు జగిత్యాల రూరల్ సీఐ కృష్ణారెడ్డి తెలిపారు. మృతుడి మొదటి భార్య పడాల జమునతో పాటు ఆమె కుమారులు పడాల చిరంజీవి, పడాల రంజిత్, కూతురు శిరీష, అల్లుడు శోభన్‌బాబును అరెస్ట్‌చేసి రిమాండ్‌కు తరలించినట్లు రూరల్ సీఐ కృష్ణారెడ్డి తెలిపారు. ఈకార్యక్రమంలో ఎస్సై సధాకర్ ఉన్నారు.

ఆత్మీయ సమ్మేళనానికి తరలిన బీజేపీ శ్రేణులు

కథలాపూర్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి) : సిరిసిల్ల బీజేపీ జిల్లా అధ్యక్షుడిగా ఇటీవల నియమితులైన రెడ్డబోయిన గోపి ఆత్మీయ సమ్మేళనానికి ఆదివారం కథలాపూర్ నుంచి బీజేపీ శ్రేణులు తరలివెళ్లారు. సిరిసిల్లలో జరిగిన ఈ కార్యక్రమానికి పలు వాహనాల్లో తరలి వెళ్లారు. కార్యక్రమంలో కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు కొడిపల్లి గోపాల్‌రెడ్డి, మండల అధ్యక్షుడు మల్యాల మారుతి, మాజీ అధ్యక్షుడు రాచమడుగ వెంకటేశ్వర్‌రావు, కాశోజీ ప్రతాప్, బద్రి సత్యం తదితరులు ఉన్నారు.

స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు నిరసిస్తూ ఆందోళన





జగిత్యాల, కొడిమ్యాలలో బీఆర్‌ఎస్ నాయకుల దిష్టిబొమ్మలను దహనం చేస్తున్న కాంగ్రెస్ శ్రేణులు

జగిత్యాల, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌ను అవమానిస్తూ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి అనుచిత వ్యాఖ్యలు చేశారని ఆరోపిస్తూ టీపీసీసీ ఇచ్చిన పిలుపు మేరకు ఆదివారం జగిత్యాల జిల్లాలోని పలు చోట్ల కాంగ్రెస్ నాయకులు నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. జగిత్యాల జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద జరిగిన ధర్నాలో టీపీసీసీ కార్యదర్శి బండ శంకర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు గాజుల రాజేందర్, కండ్లపెల్లి దుర్గయ్య, మన్సూర్, కమాలుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

●**కథలాపూర్:** అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌పై నిండు సభలో అవమాన పరిచేలా వ్యాఖ్యలు చేసిన కేటీఆర్, జగదీశ్‌రెడ్డి దిష్టిబొమ్మలను ఆదివారం కథలాపూర్‌లో కాంగ్రెస్ నాయకులు దహనం చేశారు. దళితుడు స్పీకర్‌గా ఉండడాన్ని జీర్ణించుకోలేని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు రాజ్యాంగబద్ధమైన కుర్చీలో ఉన్నప్పటికీ తీవ్ర పదజాలం ఉపయోగించడం దారుణమని అన్నారు. వేములవాడ-కోరుట్ల రహదారిపై బస్టాండ్ వద్ద చిత్రపటాలను దహనం చేశారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కాయితి నాగరాజు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అజీం, రాష్ట్ర చేనేత విభాగం కార్యదర్శి పులి హరిప్రసాద్, ఏఎంసీ డైరెక్టర్ వాకిటి రాజరెడ్డి, చెదలు సత్యనారాయణ, జిల్లా కార్యదర్శి గోపిడి ధనుంజయ్‌రెడ్డి, శ్రీహరి, అల్లకొండ లింగంగౌడ్, న్యావనంది శేఖర్, పెగ్గెర్ల గంగాధర్, జవ్వాజి రవి తదితరులు ఉన్నారు.

●**కొడిమ్యాల:** స్పీకర్ గడ్డం ప్రసాద్‌ను బీఆర్‌ఎస్ నాయకులు కేటీఆర్, జగదీశ్వర్‌రెడ్డి ఏకవచనంతో మాట్లాడినందుకు నిరసనగా ఆదివారం మండల కేంద్రంలోని అంగడి బజారులో బీఆర్‌ఎస్ నాయకుల దిష్టిబొమ్మలను మండల కాంగ్రెస్ నాయకులు దహనం చేశారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు నారాయణగౌడ్, సీనియర్ నాయకుడు మల్లిఖార్జున్‌రెడ్డి, చంద్రమోహన్‌రెడ్డి, హన్మండ్లు. స్వామి, లక్ష్మన్, గంగన్న, రవి, శంకర్‌గౌడ్, నాగార్జున్, నర్సయ్య, అంజయ్య, సుల్తాన్, లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

●**భీమారం:** భీమారం మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆదివారం బీఆర్‌ఎస్ నాయకుల దిష్టిబొమ్మను దహనం చేశారు. అసెంబ్లీలో స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ పట్ల బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు కేటీఆర్, జగదీశ్వర్ రెడ్డిలు ఏకవచనంతో మాట్లాడారని వారి దిష్టిబొమ్మలను దహనం చేశారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సింగిరెడ్డి నరేష్ రెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మిట్టపెల్లి రాజరెడ్డి, నాయకులు నీరటి మల్లేశం, ఉరుమడ్ల లక్ష్మణ్, పుప్పాల కొమురయ్య, తోకల నర్సయ్య, బక్కూరి నరేష్, ముంజ కిషన్, ఎండీ సయ్యద్, ఎనుగంటి హరీష్, చెక్కపెల్లి సంజీవ్, బొమ్మెన ప్రశాంత్, చెక్కపెల్లి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

●**మేడిపల్లి:** స్పీకర్ శ్రీ గడ్డం ప్రసాద్‌పై బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు కేటీఆర్, జగదీశ్వర్‌రెడ్డి ఏకవచనంతో మాట్లాడుతూ సభ మర్యాదను మంటకలిపారని కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో వారి దిష్టిబొమ్మలను దహనం చేశారు. బీఆర్‌ఎస్ నాయకులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. వారు తక్షణమే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల శాఖ అధ్యక్షులు రమేష్‌రెడ్డి, నరేష్‌రెడ్డి, మాదం వినోద్ యాదవ్, జలందర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, నారాయణరెడ్డి, నాగరాజు, రాజేష్, మాజీద్, సాల్మాన్, లాజర్, ఇస్రాయిల్, ప్రేమ్‌సాగర్, జలందర్‌రెడ్డి, వినయ్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



మేడిపల్లిలో దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

ఘనంగా పొట్టి శ్రీరాములు జయంతి



మెట్‌పల్లిలో నివాళులు అర్పిస్తున్న ఆర్యవైశ్య సంఘం నాయకులు

మెట్‌పల్లిటౌన్, మార్చి 16(ఆంధ్రజ్యోతి) : మెట్‌పల్లి పట్టణంలోని వాసవి గార్డెన్‌లో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఆదివారం అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్య సంఘం నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు మైలారపు రాంబాబు, సంయుక్త కార్యదర్శి కొత్త నవీన్, కోట కిరణ్ కుమార్, చాడ సురేష్, దొంతుల సంతోష్, శ్రీనివాస్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

పొట్టి శ్రీరాములు విగ్రహావిష్కరణ

రాయికల్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): రాయికల్ పట్టణంలో ఆదివారం మండల ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో పొట్టి శ్రీరాములు జయంతి సందర్భంగా ఆయన విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్యుల అభివృద్ధి కోసం పొట్టి శ్రీరాములు చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు గంప ఆనందం, ప్రధాన కార్యదర్శి పిప్పరి గంగాధర్, కోశాధికారి చింత అశోక్, పట్టణ అధ్యక్షుడు కూరగాయల రవి, రాష్ట్ర నాయకులు ఎలగందుల సత్యనారాయణ, పట్టణ నాయకులు గరిపెల్లి శ్రీనివాస్, పవన్, చింత శివ కుమార్, లింగ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్ప ఆలయ వార్షికోత్సవం

మెట్‌పల్లిటౌన్, మార్చి 16(ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని అయ్యప్ప స్వామి ఆలయ 29వ వార్షికోత్సవ వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో అర్చకులు ప్రత్యేక పూజలు, అర్చన అభిషేకలు నిర్వహించారు. ఆలయంలో మాజీ ఎమ్మెల్యే బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షులు కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో యజ్ఞం, అభిషేకం, తదితర ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మహిళలు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

కొడిమ్యాల, మార్చి 16(ఆంధ్రజ్యోతి) : మండలంలోని పూడూర్ గ్రామ శివారులో నిర్మించనున్న రామాలయ నిర్మాణానికి పూడూర్ గ్రామానికి చెందిన ఏగుర్ల అంజయ్య 25వేల116 రూపాయల విరాళాన్ని ఆదివారం ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులకు అందించారు. దాతకు ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు, గ్రామ ప్రముఖులు కృతజ్ఞతలు తెలిపారు.

గుప్పుమంటున్న గంజాయి

(5వ పేజీ తరువాయి..)

గంజాయి తరలిస్తున్నారని తెలుస్తోంది. పాఠశాలలు, ఇతర జన సంచారం ఉన్న ప్రాంతాల్లో ప్రత్యేకంగా ఎంపిక చేసుకున్న టేలాలు, పాన్ డబ్బాలు, కిరాణాలు, అడ్డాల్లో గంజాయి విక్రయిస్తున్నారు. కొన్ని ప్రాంతాల్లో ఒక్కో ప్యాకెట్ రూ.500 నుంచి రూ.1,000 వరకు అమ్ముతున్నట్లు తెలుస్తోంది. ఒక్కో చాక్లెట్ రూ.30 నుంచి రూ.50 వరకు విక్రయిస్తున్నట్లు సమాచారం.

●ప్రత్యేక వాట్సాప్ గ్రూపులు..

మత్తు పదార్థాలకు బానిసలైన వారు ప్రత్యేకంగా వాట్సాప్ గ్రూపులు తయారు చేసుకుంటున్నట్లు అనుమానాలున్నాయి. విద్యార్థులు, యువతీ యువకులు గంజాయికి అలవాటు అయ్యే వరకు మొదట ఉచితంగా సరఫరా చేస్తున్నారనే ప్రచారం సాగుతోంది. అనంతరం తక్కువ ధరకు విక్రయించి, తదుపరి బానిసలైన వారికి అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు తెలుస్తోంది. కోడ్ భాషల్లో చాటింగ్ చేస్తూ మత్తు పదార్థాలు ఏ స్థలంలో...ఎంత ధరకు...ఎప్పుడు సరఫరా చేస్తారో తదితర సమాచారాన్ని ఇచ్చి పుచ్చుకుంటున్నట్లు సమాచారం. సదరు గ్రూపుల్లో మత్తు పదార్థాల వ్యసనానికి లోనైన విద్యార్థులు, యువతీ యువకులతో పాటు విక్రయాలు, సరఫరా చేస్తున్న వ్యక్తులు సభ్యులుగా ఉంటున్నట్లు సమాచారం. కోడ్ భాషలు, సైగలతో ఒకరినొకరు మత్తు పదార్థాలను ఇచ్చి పుచ్చుకుంటున్నట్లు తెలుస్తోంది.

●విపరీత స్వభావంతో వ్యసనదారులు..

గంజాయి, ఇతర మత్తు పదార్థాలు సేవించిన యువతీ యువకుల్లో అసాధారణ చేష్టలు కనిపిస్తున్నట్లు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు అంటున్నారు. కొందరు బిగ్గరగా నవ్వడం, మరికొందరు ఏడుస్తుండడం వంటివి చేస్తున్నారు. గంజాయి తాగిన తర్వాత మితిమీరిన ఆనందాన్ని పొందడంతో పాటు నాడీ వ్యవస్థపై ప్రభావం పడడం వల్ల మెదడు ఆధీనంలో ఉండకుండా ప్రవర్తిస్తున్నారని తెలుస్తోంది. గంజాయి క్రమంగా వ్యసనంగా మారి ఇతర అనారోగ్య సమస్యలకు, నేరాలు చేయడానికి కారణమవుతున్నాయని వైద్య నిపుణులు అంటున్నారు.

●జాగ్రత్తలు తీసుకుంటేనే మేలు..

పిల్లలు చెడు వ్యసనాలకు లోనుకాకుండా ఇంట్లో తల్లిదండ్రులు, పాఠశాలల్లో ఉపాధ్యాయులు, స్వచ్ఛంద సంస్థలు, యువజన, మహిళా సంఘాలు ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటేనే మేలు జరుగుతుందని నిపుణులు అంటున్నారు. పిల్లల్లో విపరీత ప్రవర్తనను కనిపెట్టిన వెంటనే సదరు విద్యార్థులు, యువతకు కౌన్సెలింగ్ నిర్వహించాలి. ముందు జాగ్రత్తలు తీసుకోవడం వల్ల చెడు వ్యసనాల నుంచి పిల్లలను కాపాడవచ్చని పలువురు పేర్కొంటున్నారు. గంజాయి, మత్తు సరఫరాను అరికట్టడంలో ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా పనిచేయాల్సిన అవసరముందని నిపుణులు సూచిస్తున్నారు.

ప్రత్యేక బృందాలతో నిఘా
-డీఎస్పీ రఘుచందర్



జగిత్యాల డివిజన్‌లో గంజాయి అమ్మకాలపై ప్రత్యేక బృందాలతో నిఘా ఏర్పాటు చేశాం. గంజాయి సరఫరాపై నిత్యం నిర్వహిస్తున్న పెట్రోలింగ్ టీమ్‌తో పాటు బ్లూకోల్ట్ సిబ్బందితో ప్రత్యేక తనిఖీలు నిర్వహిస్తున్నాం. విద్యార్థులకు, యువకులకు గంజాయి సరఫరా చేసే వ్యక్తులకు చట్టప్రకారం కఠిన శిక్ష పడుతుంది.

'అభివృద్ధిని చూసి ఓర్వలేక ప్రతిపక్షాల విమర్శలు'

మెట్‌పల్లిటౌన్, మార్చి 16(ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో అభివృద్ధిని చూసి ఓర్వలేకనే ప్రతిపక్షాలు ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్నాయని కాంగ్రెస్ పార్టీ కోరుట్ల నియోజకవర్గ ఇన్‌చార్జ్ జువ్వాడి నర్సింగరావు అన్నారు. కాంగ్రెస్ చేస్తున్న అభివృద్ధి సంక్షేమంను విస్మరించి బురద జల్లడమే పనిగా పెట్టుకున్నాయని కాంగ్రెస్ పార్టీ కోరుట్ల నియోజకవర్గ ఇన్‌చార్జ్ జువ్వాడి నర్సింగరావు అన్నారు. ఆదివారం ఆయన స్థానిక విలేఖరులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక దేశంలో ఎక్కడా లేని విధంగా మహిళ సంక్షేమానికి సీఎం రేవంత్‌రెడ్డి అనేక పథకాలు అమలు చేస్తున్నారన్నారు. ఇందులో భాగంగానే మహిళలకు ఆర్టీసీలో ఉచిత ప్రయాణంతో పాటు రాష్ట్రంలో కోటి మంది మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయడామే లక్ష్యంగా పథకాలను రూపొందించి అమలు చేస్తున్నామన్నారు.

ఆర్టీసీ బస్సులను, పెట్రోల్ బంక్‌లను, ఇతర కొన్ని సంస్థలను మహిళలకు అప్పజెప్పిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వంకు చెందుతుందన్నారు. ప్రతి రంగంలో మహిళలను అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేకనే ప్రతిపక్షాలు అనవసరమైన, తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని అన్నారు. ఇప్పటికైన ప్రతిపక్షాలు తప్పుడు అరోపణలు మానుకొవాలని కోరారు.

గొల్లపల్లి మండలంలో 41 డిగ్రీల ఉష్ణోగ్రత

జగిత్యాల అర్బన్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఆదివారం అత్యధికంగా గొల్లపల్లి మండంలో 41 డిగ్రీల సెల్సియస్‌గా ఉష్ణోగ్రత నమోదైంది. రాయికల్‌లో 40.7, మల్లాపూర్‌లో 40.6, భీమారంలో 40.6, పెగడపల్లిలో 40.6, మెట్‌పల్లిలో 40.4, ధర్మపురిలో 40.4, కోరుట్లలో 40.4, ఇబ్రహీంపట్నంలో 40.3, ఎండపల్లిలో 40.2, సారంగపూర్‌లో 40.2 డిగ్రీల సెల్సియస్‌గా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



సమ్మేళనంలో పాల్గొన్న విద్యార్థులు

రాయికల్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని భూపతిపూర్ ప్రభుత్వ పాఠశాలలో 2001-02 బ్యాచ్‌కు చెందిన పదవ తరగతి విద్యార్థులు ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా తమ బాల్య విద్యాభ్యాస క్షణాలను గుర్తు తెచ్చుకుని ఆనందంగా గడిపారు. అనంతరం తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ఘనంగా సన్మానించారు.

కాన్షీరాం జయంతి వేడుకలు



కాన్షీరాం చిత్రపటానికి పూలమాల వేస్తున్న నాయకులు

మెట్‌పల్లిటౌన్, మార్చి 16(ఆంధ్రజ్యోతి) : బహుజన్ సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో ఆదివారం కాన్షీరాం 91వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా బీఎస్పీ నాయకులు బత్తుల లక్ష్మణ్ మాట్లాడుతూ దేశంలో బహుజనుల రాజ్యాధికారం కోసం పోరాడిన గొప్ప వ్యక్తి కాన్సిరాం అన్నారు. బహుజనుల కోసం ఆయన చేసిన సేవలు మరువలేనివన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు గోరుమంతుల సురేందర్, నీరటి నరేందర్, దేవయ్య, స్వామి, ఉపేందర్, పవన్ తదితరులు పాల్గొన్నారు.

అన్ని వర్గాల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

●ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్



పెగడపల్లిలో సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ చేస్తున్న లక్ష్మణ్ కుమార్

పెగడపల్లి, మార్చి 16 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలోని పేదల సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పేర్కొన్నారు. పెగడపల్లి మండలంలోని పలు గ్రామాలకు చెందిన 88 మందికి మంజూరైన రూ. 28 లక్షల 88వేల 500ల విలువ గల ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను ఆదివారం పెగడపల్లి మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రభుత్వ విప్ లక్ష్మణ్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరై పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ గత ప్రభుత్వం రాష్ట్ర ఖజానాను ఖాళీ చేసి అప్పుల రాష్ట్రంగా మాకు అప్పగించిడం జరిగిందని, అయినప్పటికి ఉన్న అప్పులను తీరుస్తూ సంక్షేమ పథకాలను అమలు చేస్తూ ఇచ్చిన హామీలను నిలబెట్టుకుంటున్నామన్నారు. రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాల ద్వారా ఆర్థిక సహాయం అందించడం జరుగుతుందని, రైతులకు రూ.రెండు లక్షల రుణ మాఫీ చేశామన్నారు. ఇందిరమ్మ ఇండ్లను కూడా గ్రామ సభలు నిర్వహించి అర్హులైన పేదలందరికి ఇండ్లను మంజూరు చేస్తున్నట్లు ప్రభుత్వ విప్ తెలిపారు. ఆయా కార్యక్రమాలలో తహసీల్దార్ రవీందర్, ఎంపీడీవో ఎ.శ్రీనివాస్ రెడ్డి, పార్టీ అధ్యక్షులు బుర్ర రాములు గౌడ్, తిరుపతి, మల్లారెడ్డి, శోభారాణి, కిషన్, తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాల పరామర్శ

పెగడపల్లి మండలంలోని బతికెపల్లి గ్రామంలో ఈ నెల 10న రాత్రి కారు ఢీకొని గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన అన్నదమ్ములు సయ్యద్ సర్వర్ పాషా, సయ్యద్ జాకీర్ పాషా కుటుంబాలను ఆదివారం ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పరామర్శించారు. ఈ సందర్భంగా పార్టీ మండల, గ్రామ శాఖ నాయకులు లక్ష్మణ్ కుమార్ వెంట ఉన్నారు.

సీఎంఆర్‌తో పేదలకు ఉన్నత వైద్యం

గొల్లపెల్లి, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యం పాలైన వారికి ముఖ్యమంత్రి సహాయ నిధితో ఉన్నత వైద్యం లభిస్తుందని ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. ఆదివారం జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండల కేంద్రంలో ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను ఆయన పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజల ఆరోగ్యం కోసం అధిక నిధులు వెచ్చిస్తున్నదన్నారు. జిల్లా కేంద్రంలో ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిని 320 బెడ్‌లుగా పెంచి జిల్లా వాసులకు మరింత నాణ్యమైన వైద్యం అందించనున్నామన్నారు. అలాగే పల్లె దవాఖానాల ఏర్పాటుతో గ్రామీణ ప్రాంతాలలో ప్రజలకు ఉన్నత వైద్యం అందిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా లక్ష్మణ్ కుమార్ 105 మంది లబ్ధిదారులకు 32 లక్షల 31వేల విలువ గల చెక్కులను పంపిణీ చేశారు.

నియామకం

కోరుట్ల, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ 320 జీ ఉప గవర్నర్ కోరుట్ల పట్టణానికి చెందిన వ్యాపార వేత్త గుంటుక చంద్ర ప్రకాష్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు క్లబ్ సభ్యులు తెలిపారు. కరీంనగర్ జిల్లా కేంద్రంలో జరిగిన లయన్స్ క్లబ్ సమావేశంలో ఇంటర్నేషనల్ 320 జిల్లా గవర్నర్‌గా చంద్రప్రకాష్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. అనంతరం నూతనంగా ఎంపికైన గుంటుక చంద్రప్రకాష్‌ను క్లబ్ సభ్యులు కుందారపు మహేందర్, గడ్డె నరేంద్ర, కొమ్ముల జీవన్ రెడ్డి, పోతని ప్రవీణ్ కుమార్, అడెపు కమల-మధు, కోమ్ముల జగపతి రెడ్డి, డాక్టర్ గండ్ర దీలీప్ రావు, అల్లాడి ప్రవీణ్ కుమార్, చాప కిషోర్, ఎలిమిల్ల ఉషాకిరణ్, గుంటుక సురేష్‌బాబు, మంచాల జగన్, గండ్ర అజయేందర్ రావు, గుంటుక మహేష్, దుబాయి శ్రీనివాస్, పోలాస రవీంధర్, గాజెంగి నాగభూషణం, మండలోజ్ రవీంధర్, నల్ల గంగాధర్, పడాల నారాయణ గౌడ్, బండి మురళి, కొత్త విద్యాసాగర్, గోనే అనిల్, తునికి రాజేష్, గంగుల రాజుశేఖర్‌లు సన్మానించి అభినందించారు.

ఘనంగా ప్రారంభమైన బ్రహ్మోత్సవాలు



పూజలు చేస్తున్న పురోహితులు

కోరుట్ల, మార్చి 16 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని అష్టలక్ష్మి సహిత లక్ష్మీనారాయణస్వామి దేవాలయ వార్షికోత్సవంలో భాగంగా బ్రహ్మోత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. దేవాలయంలో సుప్రభాత సేవలతో కార్యక్రమాలను ప్రారంభించిన వేద పండితులు అగ్ని ప్రతిష్ట యాగశాల ప్రవేశం, చతుస్థానార్చన, నిత్యాహవనం, మూలమంత్రి మూర్తి, గరుడ సంతాన గోపాల హవనం, పంచసూక్త హవనం, పూర్ణాహుతి, ధ్వరోహణం, సామూహిక విష్ణు సహస్రనామ పారణ కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే అది శ్రీనివాస్, కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జు జువ్వాడి నర్సింగ రావుతో పాటు దేవాలయ వ్యవస్థాపకుడు బూర్గు రామస్వామి గౌడ్‌లు ప్రత్యేక పూజలలో పాల్గొన్నారు. కార్యక్రమంలో దేవాలయ అర్చకులు సముద్రాల రామచార్యులు, శ్రీనివాసాచార్యులు, శ్రీకాంత్ చార్యులు, బాలాజీ స్వామి, వరుణ స్వామి, వాసుదేవా చార్యులు, రమణాచార్యులు, ఇందూర్తి మదుసూదనా చారీ పెరంబదూరి శ్రీనివాస్, సింగిల్ విండో చైర్మెన్ భూం రెడ్డి దేవాలయ అభివృద్ధి కమిటీ సభ్యులు పుపాల ప్రభాకర్, ముత్యాల గంగాధర్, ఉప్పులూరి రాఘవులు, పడాల వెంకటేశ్వర రావు, బాదం పురుషోత్తం, చిలుక గంగాధర్, రేగు మోహన్ పాల్గొన్నారు.

ఉత్తమ మహిళా ఉద్యోగులకు సన్మానం

రాయికల్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): రాయికల్ మండల అడిషనల్ ప్రోగ్రాం ఆఫీసర్ (ఏపీవో) ఉత్తమ మహిళా ఉద్యోగిగా ఎంపికకావడంతో సన్మానించారు. ఆదివారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్, జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్, అదనపు కలెక్టర్ బీఎస్ లత సన్మానించారు.

●రాయికల్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌లోని కళాభారతిలో శ్రీ లంబోదర కల్చరల్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన మహిళా దినోత్సవ వేడుకల్లో రాయికల్ పట్టణానికి చెందిన న్యాయవాది అల్లె వనిత ఉత్తమ మహిళా ఉద్యోగిగా ఎంపికైంది. వనితను పలువురు నాయకులు, నిర్వాహకులు ఆదివారం సన్మానించారు.

పెద్దాపూర్ జాతరకు తరలిన భక్తులు

కోరుట్ల రూరల్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): మండలంతో పాటు కోరుట్ల పట్టణంలోని పలు వార్డులకు చెందిన మల్లన్న భక్తులు ప్రత్యేక వాహనాల ద్వారా పెద్దాపూర్ బయలు దేరడంతో అన్ని రహదారులు పెద్దాపూర్ వైపుగా మారాయి. పెద్దాపూర్‌లోని పుణ్య క్షేత్రమైన మల్లన్న దేవాలయంలో బోనాల జాతర పురస్కరించుకొని భక్తులు ప్రత్యేక వాహనల ద్వార కోరుట్ల పట్టణం మీదుగా పెద్దాపూర్ వైపు సాగారు. దీంతో కోరుట్ల పట్టణంలోని జాతీయ రహదారిపై రద్దీగా మారింది. ఉదయం నుండే భక్తులు కోరుట్ల పట్టణంలోని వార్డులు, మండలంలోని అన్ని గ్రామాల నుండి అధిక సంఖ్యలో తరలి వెల్లారు.

ఎమ్మార్పీఎస్ దీక్ష

బీర్‌పూర్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): బీర్‌పూర్ మండల కేంద్రంలో ఆదివారం ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు సుద్దాల తిరుపతి ఆధ్వర్యంలో నిరసన దీక్షను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ నాయకులు మాట్లాడుతూ మంద కృష్ణ మాదిగ ఆదేశాల మేరకు బీర్‌పూర్ మండల కేంద్రంలో నిరసన దీక్షను ప్రారంభించడం జరిగిందని అన్నారు. ఈ నిరసన దీక్ష కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల ప్రధాన కార్యదర్శి నారపాక ప్రభాకర్, ఎమ్మార్పీఎస్ సభ్యులు మురళి, నర్సయ్య, వంశి, రవి, మహేష్, రాజేష్‌నరేష్, రాజేష్, ఉదయ్, సూర్యతేజ తదితరులు పాల్గొన్నారు.